

## పాఠశాలలకు ఉచిత విద్యుత్ హర్షణీయం

కరీంనగర్ టౌన్, సెప్టెంబరు 5: ప్రభుత్వ పాఠశాలలకు ఉచిత విద్యుత్ ఇస్తూ రాష్ట్ర ప్రభుత్వం జీవోను విడుదల చేయడంపై ఎస్టీయు జిల్లాశాఖ హర్షం వ్యక్తం చేసింది. పాఠశాలల్లో సర్వీస్ పర్సన్ల నియామకానికి సంబంధించిన నిధులు, స్కూల్ గ్రాంటల్స్ త్వరగా విడుదల చేయాలని ఎస్టీయూ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు పీఆర్ శ్రీనివాస్, కట్టా రవీంద్రాచారి ఒక ప్రకటనలో ప్రభుత్వాన్ని కోరారు.

# కల్వల కన్నీరు తుడిచేదెవరు?

- గత సంవత్సరం ప్రాజెక్టుకు గండి
- వృథాగా పోతున్న సాగునీరు
- రైతుల గోడు పట్టించుకోని అధికారులు, ప్రజాప్రతినిధులు



కల్వల ప్రాజెక్టు గండి నుంచి దిగువకు పోతున్న నీరు

శంకరపట్నం, సెప్టెంబరు 5: నిండు వర్షాకాలంలోనూ కల్వల ప్రాజెక్టు నీరు లేక వెలవెలబోతోంది. గత సంవత్సరం మత్తడి వద్ద పడిన గండిని పూర్తి స్థాయిలో మరమ్మత్తు చేయకపోవడంతో మళ్లీ గండి పడి నీరు వృథాగా దిగువకు పోతోంది. శంకరపట్నం మండలం కల్వల శివారులో ప్రాజెక్టును నిర్మించారు. గత సంవత్సరం వర్షాకాలంలో కురిసిన భారీ వర్షానికి ప్రాజెక్టుకు గండి పడింది. ప్రజాప్రతి నిధుల సూచనల మేరకు అధికారులు అప్పటికప్పుడు ప్రాజెక్టు గండికి తాత్కాలిక మరమ్మతులు చేశారు. ఆయకట్టుకు నీరందింది. ఈ వర్షాకాలంలో కట్టకు మళ్లీ గండి పడడంతో నీరు వృథాగా దిగువకు పోతోంది.

### గొలుసు కట్టు చెరువుల చివరన కల్వల ప్రాజెక్టు...

వాగుల నుంచి వచ్చే వరద నీటిని ఒడిసిపట్టి రైతులకు సాగునీరు అందించేందుకు కల్వల ప్రాజెక్టును గొలుసు కట్టు చెరువులకు అనుసంధానంగా నిర్మించారు. హుస్నాబాద్, చిగురుమామిడి, సైదాపూర్, శంకరపట్నం మండలాల్లోని వర్షపు నీరు గొలుసు కట్టు చెరువుల ద్వారా ప్రాజెక్టులోకి చేరుతుంది. ప్రాజెక్టుకు 422 కిలో మీటర్ల క్యాచ్‌మెంట్ ఏరియా ఉంది. శంకరపట్నం, వీణవంక మండలాల్లోని 3,500 ఎకరాలకు సాగునీరు అందుతుంది. ఈ వర్షాకాలంలో గండి పడడంతో వచ్చిన నీరు వచ్చినట్లు దిగువకు వెళుతోంది. ఈ నీటిని ఆధారంగా చేసుకుని కొంత మంది రైతులు పొలాలు సాగు చేశారు. ఎగువ నుంచి వచ్చే నీరు ఆగిపోతే ఆ పొలాలు ఎండే ప్రమాదం ఉంది. ప్రాజెక్టుకు మరమ్మతులు చేపట్టకపోతే యాసంగిలో ఒక్క ఎకరాకు కూడా సాగు నీరందదు.

### రైతుల గోడు వినేదెవరు?

ఈ ప్రాజెక్టు మానకొండూర్ నియోజకవర్గంలోని కల్వల శివారులో ఉంది. ఆయకట్టు హుజూరాబాద్ నియోజకవర్గంలోని వీణవంక మండలంలో ఉంది. ప్రాజెక్టు గండి పడి నీరు వృథాగా దిగువకు పోతున్న సంబంధిత నియోజకవర్గాల ఎమ్మెల్యేలు పట్టించుకోవడం లేదని రైతులు ఆందోళన చెందుతున్నారు. ఇంత వరకు గండి పడిన ప్రాజెక్టును ఎవరు పట్టించుకున్న పాపన పోలేదని రైతులు ఆవేదన వ్యక్తం చస్తున్నారు.

### నాయకులు ఇచ్చిన మాట మరిచారా..

గత సంవత్సరం ప్రాజెక్టుకు గండిపడినప్పుడు అప్పటి అధికార బీఆర్ఎస్ పార్టీతోపాటు వివిధ పార్టీల నాయకులు ప్రాజెక్టును పరిశీలించి శాశ్వతంగా చర్యలు తీసుకుంటామని హామీలు ఇచ్చారు. తర్వాత అవి మర్చిపోయారు. గత ప్రభుత్వ హయాంలో మాజీ ఎంపీ బోయినపల్లి వినోద్‌కుమార్, అప్పటి ఎమ్మెల్యే రసమయి బాలకిషన్, ఎమ్మెల్సీ పాడి కౌశిక్‌రెడ్డితో పాటు తదితరులు గండి పడిన ప్రాజెక్టును సందర్శించారు. ప్రాజెక్టుకు శాశ్వత మరమ్మతులు చేయిస్తామన్నారు. ప్రాజెక్టుకు గండిపడి నీళ్లు వృథాగా పోతున్న విషయంపై ఇరిగేషన్ డీఈ కవితను ఫోన్‌లో సంప్రదించగా ప్రాజెక్టు మరమ్మతులకు అంచనా వేసి ప్రతిపాదనలు ప్రభుత్వానికి అందజేసినట్లు తెలిపారు.

### రోడ్డున పడ్డాం.

**భూమ రవి, మత్స్యకార సంఘం గ్రామ అధ్యక్షుడు, గద్దపాక**



గద్దపాక గ్రామానికి చెందిన 84 కుటుంబాల మత్స్యకారులు కల్వల ప్రాజెక్టులో చేపలు పట్టుకొని జీవనోపాధి పొందుతున్నాం. ప్రాజెక్టుకు గండి పడడంతో జీవనోపాధి కోల్పోయి రోడ్డున పడ్డాం. ప్రభుత్వం వెంటనే ప్రాజెక్టు పనులు పూర్తి చేసి మమ్మల్ని ఆదుకోవాలి.

### ప్రాజెక్టుకు మరమ్మతులు చేయాలి..

**రాసపెల్లి పోచయ్య, రైతు, పోతిరెడ్డిపల్లి (వీణవంక మండలం)**



కల్వల ప్రాజెక్టు ఆయకట్టు కింద ఎనిమిది ఎకరాల వ్యవసాయ భూమి సాగు చేస్తున్నా. ప్రస్తుతం గండి నుంచి వస్తున్న నీటితో వరి సాగు చేస్తున్నా. వర్షాలు తగ్గి పై నుంచి నీరు రాకపోతే పంటలు ఎడిపోయే ప్రమాదం ఉంది. ప్రాజెక్టుకు మరమ్మతులు చేసి రైతులను ఆదుకోవాలి.

### యాసంగి వరకైనా నీరందించాలి.

**మర్రి రాజు, రైతు, లస్మక్కపల్లి (వీణవంక మండలం)**



యాసంగి వరకు కల్వల ప్రాజెక్టును పూర్తి చేసి రైతులను ఆదుకోవాలి. కాకతీయ కెనాల్ కింద ఉన్న ఎస్కేప్ ద్వారా నీరు విడుదల చేస్తే కల్వల ప్రాజెక్టులోకి వస్తాయి. అధికారులు తక్షణమే మరమ్మతులు ప్రారంభించాలి.



అర్కండ్ల వాగు ద్వారా కల్వల ప్రాజెక్టులో చేరుతున్న నీరు



# మార్క్‌ఫెడ్‌లో రూ. 76.77 లక్షల దుర్వినియోగం

- మార్కెటింగ్ ఎగ్జిక్యూటివ్, అకౌంటెంట్ కలిసి సంస్థకు కుచ్చుటోపి
- నిర్లక్ష్యంగా వ్యవహరించిన జిల్లా మేనేజర్
- కటకటాల్లో డీఎం... ఇద్దరు నిందితులు

(ఆంధ్రజ్యోతి ప్రతినిధి, కరీంనగర్)

మార్క్‌ఫెడ్ సంస్థలో ఎరువులు విక్రయించిన 76.77 లక్షల రూపాయలను సంస్థకు చెల్లించకుండా ఆ సంస్థకే చెందిన ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులు స్వాహా చేశారు. వేములవాడ సేల్స్‌పాయింట్ కేంద్రంగా ఈ నిధుల స్వాహా జరిగింది. నిధుల స్వాహాను ఆలస్యంగా గుర్తించిన సంస్థ అధికారులు విచారణ జరిపి విషయం బయటకు రాకుండా, గుట్టుచప్పుడు లేకుండా వేములవాడ రూరల్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. విచారణ జరిపించిన పోలీసులు నిధులను మింగిన ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులైన మార్కెటింగ్ ఎగ్జిక్యూటివ్ పల్లె రమేశ్‌గౌడ్, అకౌంటెంట్ బొమ్మ భాస్కర్‌గౌడ్‌ను నిర్లక్ష్యంగా వ్యవహరించి నిధుల స్వాహాకు అవకాశం కలిగేలా వ్యవహరించిన జిల్లా మేనేజర్ దివ్యభారతిని ఆగస్టు 31న అరెస్టు చేసి రిమాండ్‌కు పంపించారు. నిధుల స్వాహాపై సమగ్ర విచారణ జరిపించేందుకు ఇంకా ఎవరి పాత్ర ఉన్నది తేల్చేందుకు పోలీసులు నిందితులను త్వరలో కస్టడీలోకి తీసుకునేందుకు ప్రయత్నిస్తున్నారు.

### అక్రమం జరిగిందిలా..

మార్క్‌ఫెడ్ సంస్థలో ఔట్‌సోర్సింగ్ ద్వారా మార్కెటింగ్ ఎగ్జిక్యూటివ్‌గా పనిచేస్తున్న కరీంనగర్ శ్రీనగర్‌కాలనీకి చెందిన పల్లె రమేశ్‌గౌడ్, ఆయన భార్య పల్లె సరిత పేరిట డీసీఎంఎస్ ద్వారా ఎరువులు విక్రయించేందుకు సేల్స్ పాయింట్ లైసెన్సు తీసుకున్నాడు. వేములవాడ డీసీఎంఎస్ గోదాంలో దానిని ఏర్పాటు చేశారు. 2022 ఏప్రిల్ మొదటి వారం నుంచి 2024 మార్చి నెలాఖరువరకు రెండేళ్ల కాలంలో ఎరువులు అమ్మి 76.77 లక్షల రూపాయలు మార్క్‌ఫెడ్ సంస్థకు జమ చేయకుండానే చెల్లించినట్లు తప్పుడు ఆధారాలు సృష్టించారు.

మార్క్‌ఫెడ్ సంస్థలోనే అకౌంటెంట్‌గా పనిచేస్తున్న కొత్తపల్లి మండలం లక్ష్మీపూర్ గ్రామానికి చెందిన బొమ్మ భాస్కర్‌గౌడ్ సహకారంతో తప్పుడు లెడ్జర్లు తయారు చేసి సదరు సొమ్ము సంస్థకు ముట్టినట్లు నమ్మించారు. ఈ వ్యవహారంపై అనుమానం వచ్చిన మార్క్‌ఫెడ్ ఉన్నతాధికారులు అంతర్గత విచారణకు ఆదేశించారు. సంస్థ హెడ్ ఆఫీసుకు చెందిన చీఫ్ అకౌంట్స్ ఆఫీసర్ మమత గత జూలై నెలలో రాజన్న సిరిసిల్ల జిల్లా, జగిత్యాల జిల్లాలకు చెందిన రికార్డులను తనిఖీ చేసి వేములవాడలో 2022 ఏప్రిల్ నుంచి 2024 మార్చి వరకు 76,77,325 రూపాయలు మార్క్‌ఫెడ్‌కు చెల్లించకుండానే సొంతానికి వాడుకున్నట్లు గుర్తించి ఆఫీసుకు నివేదిక సమర్పించారు.

మార్క్‌ఫెడ్ సంస్థ ద్వారా డీసీఎంఎస్‌కు సరఫరా చేసే ఎరువుల విక్రయానికి సంబంధించిన లావాదేవీలను ఎప్పటికప్పుడు పర్యవేక్షించాల్సిన కరీంనగర్ జిల్లా మార్క్‌ఫెడ్ సంస్థ మేనేజర్ దివ్యభారతి నిర్లక్ష్యం వహించారని నిర్ధారణకు వచ్చి ఉన్నతాధికారులు ఆమెను సస్పెండ్ చేశారు. ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులుగా ఉన్న పల్లె రమేశ్‌గౌడ్‌ను, బొమ్మ భాస్కర్‌గౌడ్‌ను ఉద్యోగాల నుంచి తొలగించారు. ప్రస్తుత జిల్లా మేనేజర్ జూలై నెలలో ఈ వ్యవహారంపై వేములవాడ రూరల్ పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. కేసు విచారించిన వేములవాడ సీఐ శ్రీనివాస్, ఎస్‌ఐ మారుతి నిధుల దుర్వినియోగానికి బాధ్యులైన పల్లె రమేశ్‌గౌడ్, బొమ్మ భాస్కర్‌గౌడ్‌ను, జిల్లా మేనేజర్ దివ్యభారతిని ఆగస్టు 31న అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. ఈ సొమ్మును రికవరీ చేయాల్సి ఉన్నందున తదుపరి విచారణలో భాగంగా వీరిని కస్టడీలోకి తీసుకోవడానికి ప్రయత్నాలు చేస్తున్నారు.

### కేసు నుంచి బయటపడేందుకు..

కేసు పోలీసుల వద్దకు వెళ్లక ముందే తానుకూడా ఇందులో ఇరుక్కునే ప్రమాదముందని గుర్తించిన మేనేజర్ దివ్యభారతి వాడుకున్న సొమ్ము 76,77,325 రూపాయలను వెంటనే చెల్లించాలని రమేశ్‌గౌడ్‌పై ఒత్తిడి తీసుకువచ్చారు.

తన దగ్గర డబ్బులు లేవని, కరీంనగర్ లోని సప్తగిరికాలనీలో ఒక ఇల్లు మాత్రమే ఉందని చెప్పి రమేశ్ చేతులెత్తేశాడని, ఆ ఇంటిపై బ్యాంకులో 25 లక్షల రూపాయల అప్పు ఉందని చెప్పాడని సమాచారం. దీంతో ఆమె ఆ 25 లక్షలను బ్యాంకుకు చెల్లించి ఇంటిని మార్టిగేజ్ నుంచి విడిపించి సదరు ఇంటిని తన కుటుంబసభ్యుల పేరిట రిజిస్టర్ చేయించుకున్నారని తెలిసింది. ఈ ఇంటిని అమ్మి దాని ద్వారా వచ్చే సొమ్మును మార్క్‌ఫెడ్‌కు చెల్లించే అవకాశముందని భావిస్తున్నారు. దివ్యభారతితోపాటు రమేశ్‌గౌడ్, భాస్కర్ గౌడ్ కూడా జైలులోనే ఉన్నందున వారు బెయిల్‌పై విడుదలైన తర్వాత రికవరీ విషయంలో ఒత్తిడి తీసుకురావాలని అధికారులు ఆలోచిస్తున్నట్లు సమాచారం. ఈ వ్యవహారంలో మేనేజర్ దివ్యభారతికి అంతర్గతంగా సంబంధం ఉండి ఉంటుందని పోలీసులు అనుమానిస్తున్నారు. కోట్లాది రూపాయల లావాదేవీలు జరిగే సంస్థలో తగిన పర్యవేక్షణ లేకపోవడం, అధికారుల నిర్లక్ష్యం కారణంగానే ఇలా నిధుల దుర్వినియోగం జరిగినట్లు భావిస్తున్నారు.

# విద్యార్థులను సన్మార్గంలో నడిపించాలి

**కలెక్టర్ పమేలా సత్పతి**



పురస్కారాలు పొందిన ఉత్తమ ఉపాధ్యాయులతో కలెక్టర్ పమేలా సత్పతి, డీఈవో



కరీంనగర్, సెప్టెంబరు 5 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): నేటి విద్యార్థులే రేపటి భావిభారత పౌరులు.. వారిని సన్మార్గంలో నడిపించాల్సిన బాధ్యత ఉపాధ్యాయులపై ఉందని కలెక్టర్ పమేలా సత్పతి అన్నారు. గురువారం ఉపాధ్యాయ దినోత్సవాన్ని పురస్కరించుకొని కలెక్టరేట్ ఆడిటోరియంలో జిల్లా విద్యా శాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఉపాధ్యాయ దినోత్సవానికి ఆమె ముఖ్యఅతిథిగా హాజరై ప్రసంగించారు. ఉపాధ్యాయ వృత్తి అత్యంత పవిత్రమైందని, ఎంతో మంది జీవితాల్లో వెలుగులు నింపుతున్నార న్నారు. బడీడు, బడిమానేసిన పిల్లలం దరిని పాఠశాలకు పంపే విధంగా తల్లిదండ్రులను ప్రోత్సహించాల్సిన బాధ్యత ఉపాధ్యాయులపై ఉందని అన్నారు. మారుమూల గ్రామాల్లో ఎక్కువగా బాల్య వివాహాలు జరుగు తాయని, ప్రభుత్వ ఉపాధ్యాయులకు ఈ వివాహాల సమాచారం తెలిసే అవకాశం ఉంటుందని, వారిని గుర్తించి బాల్య వివాహాలు నివారించాలని కోరారు. ప్రభుత్వ పాఠశాలల్లో పనిచేసే కొందరు ఉపాధ్యాయులు వారి సొంత డబ్బులతో పిల్లలకు ఐడి కార్డులు, టై బెల్ట్ వంటి వస్తు వులు కొనిస్తున్నారని, పాఠశాలల్లోని చిన్నచిన్న మరమ్మతులు చేయిస్తున్నారని తెలిపారు. ఈ మధ్య కాలంలో పాఠశాల విద్యార్థులు మత్తు పదార్థాలకు బానిసల వుతు న్న సంఘటనలు వెలుగు చూస్తున్నాయని, పిల్లల ప్రవర్తనను ఉపాధ్యాయులు గుర్తించి పెడదోవ పట్టకుండా చూడాలని కోరారు. జిల్లాలో గత ఏడాది పదో తరగతి సప్లిమెంటరీ పరీక్షలు రాసిన 80 శాతం మంది విద్యార్థులు ఉత్తీర్ణత సాధించేం దుకు ఉపాధ్యాయులు ఎంతో కృషి చేశా రని కలెక్టర్ అభినందించారు. గుర్తింపునకు నోచుకోని ఎంతో మంది ఉపాధ్యాయులు నిశ్శబ్దంగా వారి సేవలను అందిస్తున్నారని, వారికి పాదాభివందనం చేస్తున్నానని కలెక్టర్ పేర్కొన్నారు.

### తల్లిదండ్రుల కంటే గురువులతోనే విద్యార్థులకు ఎక్కువ అనుబంధం: ఎమ్మెల్యే 'గంగుల'

విద్యార్థులకు తల్లిదండ్రుల కంటే గురువుతోనే ఎక్కువ అనుబంధం ఉంటుందని మాజీ మంత్రి, ఎమ్మెల్యే గంగుల కమలాకర్ అన్నారు. విద్యార్థులు ఇంట్లో కంటే పాఠశాలల్లోనే ఎక్కువ సమయం గడుపుతారని, తద్వారా గురువుతో అనుబంధం పెరుగుతుందని చెప్పారు. రైతులు, ఉపాధ్యాయుల చేసే సేవలు వెలకట్టలేనిదని కొనియాడారు. గురువుల సూచనలను పాటించి విద్యార్థులు ఉన్నత శిఖరాలకు ఎదగాలని ఆకాంక్షించారు. జిల్లాలోని 44 మంది ప్రభుత్వ, ప్రైవేట్ ఉపాధ్యాయులను జిల్లాస్థాయి ఉత్తమ ఉపాధ్యాయులుగా సన్మానించి అవార్డులను అందించారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ ప్రఫుల్ దేశాయ్, ట్రైనీ కలెక్టర్ అజయ్‌యాదవ్, మున్సిపల్ కమిషనర్ చాహత్‌బాజ్‌పాయ్,డీఈవో జనార్దన్‌రావు పాల్గొన్నారు.



## మహిళా మోర్చా ఆధ్వర్యంలో రాష్ట్ర ప్రభుత్వ దిష్టిబొమ్మ దహనం

గణేశ్‌నగర్, సెప్టెంబరు 5: కుమరం భీం ఆసిఫాబాద్ జిల్లాలో ఆదివాసీ మహిళపై అత్యాచారయత్నం, దాడి ఘటన ఖండిస్తూ బీజేపీ మహిళా మోర్చా ఆధ్వర్యంలో తెలంగాణ చౌక్‌లో రాష్ట్ర ప్రభుత్వ దిష్టిబొమ్మను గురువారం దహనం చేశారు. ఈ సందర్భంగా బీజేపీ మహిళా మోర్చా జిల్లా అధ్యక్షురాలు చొప్పరి జయశ్రీ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వ నిర్లక్ష్య ధోరణి వల్లే ఇలాంటి ఘటనలు జరుగుతున్నాయన్నారు. రాష్ట్రంలో మహిళలకు పూర్తిగా రక్షణ కరువైందని, అత్యాచారానికి గురైన వారికి న్యాయం చేయాలని డిమాండ్ చేస్తున్నామన్నారు. కొమరం భీం ఆసిఫాబాద్ జిల్లాలో సంఘటన జరిగి ఐదు రోజులు కావస్తున్నా రాష్ట్ర ప్రభు త్వం నిందితుడిపై ఎలాంటి చర్య తీసుకోకపోవడం సిగ్గుచేటన్నారు. నిందితుడిని కఠినంగా శిక్షించాలని, బాధితురాలికి న్యాయం జరిగేంత వరకు భారతీయ జనతా పార్టీ అండగా ఉంటుందన్నారు. కార్యక్రమంలో స్టేట్ ఎగ్జిక్యూటివ్‌మెంబర్ దేశ శిల్ప, బైరి చంద్రకళ, ఎడ్ల ప్రేమలత, లావణ్యారెడ్డి, తేజ, అశ్విని, అన్నపూర్ణ పాల్గొన్నారు.



దిష్టిబొమ్మ దహనం చేస్తున్న మహిళా మోర్చా కార్యకర్తలు

# భూ కబ్జాదారుల్లో అలజడి

- దూకుడు పెంచిన ఈవోడబ్ల్యూ
- కొనసాగుతున్న ఫిర్యాదుల పరంపర
- అక్రమాలకు పాల్పడిన వారిలో దడ...





కరీంనగర్ క్రైం, సెప్టెంబరు 5: కరీంనగర్‌లో భూకబ్జాలు, ఇతర భూ వివాదాలతో మోసాలకు పాల్పడిన ఘటనలపై సీపీ పర్యవేక్షణలో ప్రత్యేకంగా ఏర్పాటైన ఎకనామిక్ అఫెన్సెస్ వింగ్ (ఈవోడబ్ల్యు) దూకుడు ను పెంచింది. కొన్ని రోజులుగా భూకబ్జాలపై కేసులు, అరెస్టు లేకపోవటం తో అక్రమార్కులు, భూ వివాదాలతో మోసాలకు పాల్పడిన వారు కొంత ఊపిరిపీల్చుకున్నారు. తాజాగా భూకబ్జా, భూ ఆక్రమణ, వివాదాలను సృష్టించి మోసాలకు పాల్పడిన ఘటనల్లో కరీంనగర్ పోలీసులు అరెస్టులు మొదలుపెట్టడంతో అక్రమార్కుల గుండెల్లో రైళ్లు పరిగెడుతున్నాయి. ఇటీవల ఒకే ఫిర్యాదుపై 21 మందిపై కేసు నమోదు చేయటంతో ఒక్కసారిగా అలజడిని సృష్టించింది. భూకబ్జాలు, బెదిరింపులు, దౌర్జన్యాలకు సంబంధించి పోలీస్‌కమిషనర్‌కు ఫిర్యాదుల పరంపర కొనసాగుతున్నప్పటికీ కొన్ని రోజులుగా ఎలాంటి కేసులు, అరెస్టులు లేక పోవటం, భూకబ్జాలపె క్రిమినల్ కేసులు, అరెస్టులు తగ్గుముఖం పట్టాయని భావిస్తున్న సమయంలో మళ్లీ అరెస్టులు అక్రమార్కులను ఒక్కసారిగా ఉలికిపాటుకు గురిచేశాయి.

**50 కేసులు.. 96 మంది అరెస్టు :** కమిషనరేట్ వ్యాప్తంగా భూకబ్జాలు, దౌర్జన్యాలు, మోసాలకు సంబంధించి ఇప్పటి వరకు 2,800పైగా ఫిర్యాదులు అందాయి. ఇందులో 50 కేసులు నమోదు చేసి, 96 మందిని అరెస్టు చేసిన పోలీసులు నిందితులను కటకటాల్లోకి పంపించారు. ఫిర్యాదుల్లో 70 నుంచి 80 శాతం వరకు భూ కబ్జాలు, మోసాలకు సంబంధించినవే రావడం కరీంనగర్‌లో లాండ్ మాఫి యా ఇంతకాలం సాగించిన అరాచకాలు ఏ స్థాయిలో ఉన్నాయనేది విషయా న్ని స్పష్టం చేస్తున్నది. భూఆక్రమణలకు గురైన బాధితులెవరైనా నేరుగా తనవద్దకు వచ్చి ఫిర్యాదు చేయవచ్చని చెప్పడంతో ఇప్పటికీ ప్రతిరోజు 30 వరకు ఫిర్యాదులు అందుతున్నాయి.

**పకడ్బందీగా కేసులు:** భూ కబ్జాలకు పాల్పడిన నిందితులపై కేసు ఏ విధంగా నమోదు చేయాలి, ఏ విధమైన ఆధారాలు, సాక్ష్యాలు సేకరించాలనే విషయంలో స్వయంగా సీపీ అభిషేక్ మొహంతి ఎప్పటికప్పుడు మానిటరింగ్ చేస్తున్నారు. విచారణ అధికారులను మార్చుతూ కేసులు, అరెస్టుల విషయం బయటకు రాకుండా జాగ్రత్తలు తీసుకుంటున్నారు. ఎంతమందిపై కేసు నమోదైందనే విషయంతోపాటు నిందితుల అరెస్టును కూడా కోర్టులో హాజరుపరిచేవరకు రహస్యంగా ఉంచుతున్నారు.

**అరెస్టుల భయంతో రాజీకి..:** భూకబ్జాలపై ఫిర్యాదులు వెల్లువెత్తడంతో అక్రమార్కులు భయపడుతున్నారు. ఫిర్యాదుదారులతో రాజీ కుదుర్చుకుంటూ అరెస్టుల నుంచి బయటపడుతున్నారు. దీనికి పోలీసు అధికారులు పరోక్షంగా సహకరిస్తున్నట్లు సమాచారం. ఎందుకటే బాధితులకు న్యాయం జరిగితే చాలన్నట్లుగా పోలీసులు భావిస్తున్నారు. ఇప్పటి వరకు భూకబ్జాలకు సంబంధించిన ఫిర్యాదుల్లో 20 శాతం వరకు రాజీకుదుర్చుకుంటూ ఆక్రమించుకున్న భూములు, ఇతర ఆస్తులను, డబ్బులను ముట్టచెబుతూ వివాదాలను పరిష్కరించుకుంటున్నారు.

## కోతి దాడిలో ఒకరికి గాయాలు

శంకరపట్నం, సెప్టెంబరు 5: మండలంలోని కేశవపట్నం గ్రామానికి చెందిన బొజ్జ కొంరయ్యపై కోతులు దాడి చేసి గాయపరిచాయి. కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం.. కొంరయ్య కొన్ని రోజుల నుంచి పక్షవాతంతో బాధపడుతున్నాడు. వైద్యుల సూచనల మేరకు ఫిజియోథెరపీ చేస్తున్నారు. గురువారం ఇంటి బయట వరండా మీద ఫిజియోథెరఫీ చేసే క్రమంలో కోతుల గుంపు దాడి చేసింది. గాయపడిన కొంరయ్యను కుటుంబ సభ్యులు ఆస్పత్రికి తరలించారు.

## హోటళ్లను తనిఖీ చేసిన ఫుడ్ ఇన్‌స్పెక్టర్

● కాలంచెల్లిన తినుబండారాల గుర్తింపు

కొడిమ్యాల, సెప్టెంబరు 5: మండల కేంద్రంలోని ఐదు హోటళ్లను గురు వారం జగిత్యాల ఫుడ్ ఇన్‌స్పెక్టర్ ఆర్.అనూష తనిఖీ చేశారు. కాలంచెల్లిన కూల్ డ్రింక్స్, తిను బండారాలను గుర్తించి వాటిని బయట పడేయించారు. తినుబండారాలను ఎల్లపుడూ శుభ్రంగా ఉంచాలన్నారు. కాలం చెల్లిన వాటిని అమ్మకానికి పెడితే కఠినచర్యలు తీసుకుంటామన్నారు. తనిఖీలో సిబ్బంది ఉన్నారు.


కాలం చెల్లిన కూల్ డ్రింక్ పారపోస్తున్న సిబ్బంది

## జోరుగా రేషన్ బియ్యం దందా

● గ్రామాల్లో అక్రమంగా కొనుగోళ్లు

మల్యాల, సెప్టెంబరు 5: పేదల కడుపునింపడానికి ప్రభుత్వాలు అందజేస్తున్న రేషన్‌బియ్యం పక్కదారి పడుతోంది. చౌకధరల దుకాణాల ద్వారా నాలుగేళ్లుగా ఉచితంగా అందిస్తున్న బియ్యం కొందరు అక్రమంగా కొనుగోలు చేస్తున్నారు. ఈ తతంగం మండలంలో కొన్నేళ్లుగా సాగుతున్నప్పటికీ అధికారులు నిమ్మకుండిపోవడం విమర్శలకు తావిస్తోంది. ప్రతి నెల మొదటి వారంలో రేషన్ దుకాణాలలో ఆహారభద్రత కార్డుల ద్వారా బియ్యం పంపిణీ చేస్తుండగా అదే రోజు నుంచి కొందరు వ్యక్తులు కొనుగోళ్లు చేస్తున్నారు. కొందరు బినామీలు బృందాలను ఏర్పాటు చేసుకొని కొనుగోళ్లు చేస్తున్నట్లు తెలుస్తోంది. ద్విచక్రవాహనాలపై ఇంటింటా తిరుగుతూ కిలో బియ్యానికి రూ.10నుంచి 15వరకు చెల్లిస్తున్నారు. కొన్నాళ్ల క్రితం గుట్టుచప్పుడు కాకుండా కొనుగోళ్లు చేసిన వ్యక్తులు ఇప్పుడు నేరుగా బియ్యం కొనడం.. తాము ప్రతి నెలా సంబంధిత అధికారులకు మాముళ్లు చెల్లిస్తున్నట్లు పేర్కొంటున్నారు. అందుకే యథేచ్ఛగా కొనుగోళ్లు చేస్తున్నప్పటికీ పట్టించుకోవడం లేదని పలువురు ఆరోపిస్తున్నారు. గతంలో కొందరిని పోలీసులు పట్టుకొని కేసులు నమోదు చేసినప్పటికీ దందా సాగుతోంది.

● రేషన్‌దుకాణాల వద్దే కొనుగోళ్లు

బియ్యంను రేషన్‌దుకాణాల వద్ద లబ్ధిదారులకు పంపిణీ చేస్తుండగా అక్రమంగా కొనుగోళ్లు చేసే వ్యక్తులు పంపిణీ రోజుల్లో అక్కడే మకాం వేస్తున్నారు. లబ్ధిదారుల వద్ద క్వింటాళ్ల కొద్ది అక్కడే కొనుగోలు చేసి కొండగట్టు తదితర ప్రాంతాల్లో నిలువ చేసుకుంటున్నట్లు తెలుస్తోంది. అక్కడి నుంచి వ్యాపారులు కొందరు పెద్ద వ్యాపారులకు రూ.20కి అప్పజెప్పుతుండగా మహారాష్ట్రకు తరలించి కిలోకి రూ.25-30వరకు విక్రయిస్తున్నట్లు గ్రామాల్లో కొనుగోలు చేసే వ్యక్తులు తెలుపుతున్నారు. ప్రభుత్వం పంపిణీ చేస్తున్న బియ్యంలో సగానికిపైగా అక్రమంగా తరలిస్తున్నారని జిల్లా ఉన్నతాధికారులు దృష్టి సారించాలని పలువురు కోరుతున్నారు.


గ్రామంలో ద్విచక్రవాహనంపై బియ్యం తరలింపు

## కోర్టు ఆదేశాలతో షటర్లు, ప్రహరీ కూల్చివేత

సిరిసిల్ల టౌన్, సెప్టెంబరు 5: సిరిసిల్ల పట్టణం గాంధీనగర్‌లో అక్రమంగా సెల్లార్లలో షెటర్లు నిర్మించారని కొందరు కోర్టుకు వెల్లగా కోర్టు ఆదేశాల మేరకు గురువారం మున్సిపల్ అధికారులు ఎక్స్‌కవేటర్‌తో భవనం సెల్లార్లలో నిర్మించిన షెటర్లు, ప్రహరీని కూల్చి వేశారు. మున్సిపల్ వైస్‌చైర్మన్‌కు సబంధించిన భవనం సెలార్లలో షెటర్లు, భవనం పడమర వైపు బాత్‌రూంలు కట్టడంతో ఓ న్యాయవాది కోర్టుకు వెళ్లారు. బాత్‌రూం షెటర్లు, ప్రహరీని తొలగించాలని కోర్టు ఆదేశించడంతో మున్సిపల్ అధికారులు ఎక్స్‌కవేటర్‌తో పాక్షికంగా కూల్చి వేశారు.


సెల్లార్‌లోని షెటర్లను తొలగిస్తున్న జేసీబీ

### నామమాత్రంగా కూల్చారు : బీజేపీ

మున్సిపల్ వైస్‌చైర్మన్‌కు సంబంధించిన భవన సెల్లార్‌లోని బాత్‌రూం, షెటర్లు, ప్రహరీని కూల్చాలని కోర్టు ఆర్డర్ ఇచ్చినా మున్సిపల్ అధికారులు తూతూ మంత్రంగా కూల్చారని బీజేపీ నాయకులు ఆరోపించారు. భవనం పడమర వైపు ఉన్న సెల్లార్లో నిబంధనలకు విరుద్ధంగా బాత్‌రూంలు నిర్మించారని కోర్టుకు ఓ న్యాయవాది వెళ్లగా వాటిని తొలగించాలని కోర్టు ఆర్డర్ ఇచ్చిన వాటిని మాత్రం మున్సిపల్ అధికారులు కూల్చలేదని ఆరోపించారు. 24 గంటల్లో కోర్టు ఆర్డర్ ప్రకారం మున్సిపల్ అధికారులు చర్యలు తీసుకోకపోతే బీజేపీ ఆధ్వర్యంలో శుక్రవారం ఆందోళనలను చేపడతామని హెచ్చరించారు.

## ఎదురెదురుగా ఢీకొన్న ద్విచక్రవాహనాలు

● ఇద్దరికి తీవ్ర గాయాలు

ఎల్లారెడ్డిపేట, సెప్టెంబరు 5: ఎల్లారెడ్డిపేట మండలం వెంకటాపూర్ -రగుడు ప్రధాన రహదారిపై గురువారం రెండు ద్విచక్రవాహనాలు ఎదురెదురుగా ఢీకొన్నాయి. ఈ సంఘటనలో జగిత్యాల, తంగళ్లపల్లి మండలం గండిలచ్చపేట గ్రామాలకు చెందిన తాటి సంతోష్, సతీష్‌కు తీవ్ర గాయాలయ్యాయి. జగిత్యాలకు చెందిన తాటి సంతోష్ తన బైక్‌పై వెంకటాపూర్ నుంచి రగుడు వైపునకు వెళుతున్నాడు. గండిలచ్చపేటకు చెందిన సతీష్ తన ద్విచక్ర వాహనంపై అతని భార్యతో కలిసి రగుడు నుంచి వెంకటాపూర్‌కు వస్తున్నాడు. రెండు బైక్‌లు ఎదురెదురుగా అతి వేగంగా ఢీకొన్నాయి. ప్రమాదంలో సంతోష్, సతీష్ గాయపడ్డారు. క్షతగాత్రులను 108 వాహనంలో సిరిసిల్ల ప్రభుత్వాసుపత్రికి తరలించారు. సంతోష్‌కు తీవ్ర గాయాలుకావడంతో పరిస్థితి విషమంగా మారింది.

### జ్వరంతో ఒకరి మృతి

రుద్రంగి, సెప్టెంబరు 5: రాజన్నసిరిసిల్ల జిల్లా రుద్రంగి మండల కేంద్రానికి చెందిన నోముల రవి (52) అనే వ్యక్తి జ్వరంతో గురువారం మృతి చెందాడు. నోముల రవి 10 రోజుల నుంచి జ్వరంతో బాధపడుతున్నాడు. చికిత్స కోసం వేములవాడ తీసుకువేళ్లే క్రమంలో మార్గమధ్యలో మృతి చెందాడని మృతుడి కుటుంబ సభ్యులు తెలిపారు.

## లంచం ఇవ్వనందుకు ఉద్యోగం నుంచి తీసేశారు

● ఎంపీడీవో కార్యాలయం ఎదుట మహిళా అటెండర్ నిరసన

గన్నేరువరం, సెప్టెంబరు 5: ఉద్యోగంలో కొనసాగాలంటే లంచం ఇవ్వాలని అధికారులు వేధిస్తున్నారని ఆరోపిస్తూ గన్నేరువరం మండల కేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయంలో అటెండర్‌గా పనిచేస్తున్న ఎడ్ల లక్ష్మి గురువారం పురుగుల మందు డబ్బా పట్టుకుని ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా లక్ష్మి మాట్లాడుతూ ఎనిమిది సంవత్సరాలుగా తాను అటెండర్‌గా ఔట్ సోర్సింగ్ పద్ధతిలో విధులు నిర్వహిస్తున్నానని, ఇపుడు జీతం పెరగడంతో ఎంపీడీవో తీగల శంకర్, ఏపీవో స్వాతి రూ. 40 వేలు లంచం ఇవ్వాలని డిమాండ్ చేశారన్నారు. లంచం ఇవ్వనందుకు తనను ఉద్యోగం నుంచి తీసేశారని ఆవేదన వ్యక్తం చేశారు. తాను నిరుపేదనని, డబ్బులు ఇవ్వలేనని వేడుకున్నప్పటికీ ఉద్యోగానికి రావద్దని నెల రోజులుగా ఇబ్బందులకు గురి చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఉన్నతాధికారులు తక్షణమే స్పందించి లంచం అడిగిన అధికారులపై చర్యలు తీసుకొని తన ఉద్యోగాన్ని ఇప్పించాలని వేడుకున్నారు. సమాచారం అందుకున్న పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని అధికారులతో మాట్లాడి న్యాయం చేస్తామని లక్ష్మికి నచ్చజెప్పడంతో ఆందోళన విరమించింది.


పురుగుల మందు డబ్బాతో నిరసన తెలుపుతున్న ఎడ్ల లక్ష్మి

## వరదకాలువలో వృద్ధురాలి మృతదేహం లభ్యం

రామడుగు, సెప్టెంబర్ 5 : మండలంలోని షానగర్‌లోని వరద కాలువలో గురువారం వృద్ధురాలి మృతదేహం లభ్యమైంది. ఎస్‌ఐ సురేందర్ తెలిపిన వివరాల ప్రకారం.. మల్యాల మండలం రామన్నపేట గ్రామానికి చెందిన పుల్లెల వెంకటమ్మ(82) ఈ నెల 3న ఇంటి నుంచి బయటికి వెళ్లింది. షానగర్ గ్రామానికి చేరుకోకపోవడంతో కుటుంబ సభ్యులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. షానగర్‌లోని వరద కాలువ వద్ద గాలింపు చర్యలు చేపట్టారు. గురువారం ఉదయం వరద కాలువలో వృద్ధురాలి మృతదేహం లభ్యమైంది. కుటుంబ సభ్యులకు సమాచారం అందించారు. వయోభారంతో అనారోగ్య సమస్యలతో బాధపడుతూ జీవితంపై విరక్తి చెంది ఆత్మహత్యకు పాల్పడినట్లు పోలీసులు తెలిపారు. మృతురాలి కుమారుడు పుల్లెల శేఖర్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

## రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి తీవ్రగాయాలు

వేములవాడ టౌన్, సెప్టెంబరు 5: ద్విచక్రవాహనం, బులెరో వాహనం ఢీకొన్న సంఘటనలో ఇద్దరికి తీవ్ర గాయాలైన సంఘటన వేములవాడ నంది కమాన్ సమీపంలో గురువారం జరిగింది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. వేములవాడ మున్సిపల్ పరిధిలోని శాలరామన్నపల్లి గ్రామానికి చెందిన కదురు నరేష్ అనే వ్యక్తి తన బంధువు అయిన తంగళపల్లి మండలం చీర్లవంచ గ్రామానికి చెందిన హర్షవర్ధన్ అనే బాలుడుతో కలిసి ద్విచక్రవాహనంపై సిరిసిల్ల వైపు వెళ్తున్నారు. ఇదే క్రమంలో బులెరో వాహనం, ద్విచక్రవాహనం ఢీకొన్న సంఘటనలో నరేష్, హర్షవర్ధన్‌కు తీవ్రగాయాలయ్యాయి. హర్షవర్ధన్ పరిస్థితి విషమించడంతో మెరుగైన చికిత్స నిమిత్తం హైద్రాబాద్ తరలించినట్లు తెలిపారు.

### ప్రాజెక్టుల్లో నీటి నిల్వలు..

| ప్రాజెక్టు | ఇన్‌ఫ్లో (క్యూసెక్కుల్లో) | ఔట్ ఫ్లో (క్యూసెక్కుల్లో) | పూర్తి సామర్థ్యం (టీఎంసీల్లో) | ప్రస్తుత నిల్వ (టీఎంసీల్లో) |
|---|---|---|---|---|
| శ్రీరాంసాగర్ | 74,837 | 8,867 | 80.5 | 74.837 |
| ఎల్లంపల్లి | 1,65,579 | 1,02,496 | 20.175 | 16.463 |
| మిడ్ మానేరు | 16,550 | 6,400 | 27.54 | 22.804 |
| ఎల్ఎండీ | 7,546 | 290 | 24.034 | 19.76 |
| ఎగువమానేరు | 27,500 | ------ | 2.00 | 2.00 |

# శ్రీరాంసాగర్ వరద గేట్లు మూసివేత

● ప్రాజెక్టులకు కొనసాగుతున్న ఇన్‌ఫ్లో

జగిత్యాల, సెప్టెంబరు 5 (ఆంధ్రజ్యోతి): ఎగువ నుంచి వస్తున్న వరద తగ్గుముఖం పట్టడంతో గురువారం శ్రీరాంసాగర్ వరద గేట్లను అధికారులు మూసివేశారు. నాలుగు, అయిదు రోజులుగా ప్రాజెక్టుకు చెందిన 41 వరద గేట్లను పైకి ఎత్తి గోదావరిలోకి నీటిని వదులుతున్నారు. క్రమక్రమంగా వరద రావడం తగ్గుముఖం పట్టడంతో ఉదయం 8 గంటలకు ప్రాజెక్టుకు చెందిన వరద గేట్లన్నింటినీ మూసివేశారు. వరద కాలువకు సైతం నీటిని వదలడాన్ని క్రమక్రమంగా తగ్గించారు. ఎస్సారెస్పీలోకి 74,837 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో వచ్చి చేరుతోంది. ప్రాజెక్టులో ప్రస్తుతం 74.837 టీఎంసీల నీరు నిల్వ ఉంది. మిషన్ భగీరథ, సాగు నీటి కాలువలు, ఇతర అవసరాలకు ప్రాజెక్టు నుంచి 8,867 క్యూసెక్కుల నీటిని వదులుతున్నారు.

### శ్రీపాద ఎల్లంపల్లికి కొనసాగుతున్న వరద

పెద్దపల్లి, సెప్టెంబరు 5 (ఆంధ్రజ్యోతి): శ్రీపాద ఎల్లంపల్లి ప్రాజెక్టులోకి వరద కొనసాగుతున్నది. గురువారం సాయంత్రం వరకు ప్రాజెక్టులోకి 1,65,579 క్యూసెక్కుల వరద నీరు ఎస్సారెస్పీ, కడెం ప్రాజెక్టులు, క్యాచ్‌మెంట్ ఏరియా నుంచి వస్తున్నది. దిగువకు 20 గేట్ల ద్వారా 1,02,496 క్యూసెక్కుల నీటిని గోదావరిలోకి వదిలి పెడుతున్నారు. ప్రాజెక్టు పూర్తి స్థాయి నీటి మట్టం 20.175 టీఎంసీలు కాగా, ప్రస్తుతం 16.4 టీఎంసీల నీళ్లు ఉన్నాయి.

### మిడ్ మానేరుకు కొనసాగుతున్న ఇన్‌ఫ్లో

బోయినపల్లి/ఇల్లంతకుంట: శ్రీ రాజరాజేశ్వర (మిడ్ మానేరు) ప్రాజెక్టులోకి ఎస్సారెస్పీ నుంచి 15,000 క్యూసెక్కులు మూల వాగునుంచి, మానేరు వాగు ద్వారా 1,550 క్యూసెక్కుల వరద నీరు వచ్చి చేరుతోంది. ఎల్ఎండీకి నీటి విడుదలను నిలిపివేయగా, అన్నపూర్ణ రిజర్వాయర్‌కు 6400 క్యూసెక్కుల నీటి విడుదల కొనసాగుతోంది. ప్రాజెక్టు పూర్తి స్థాయి నీటిమట్టం 318 మీటర్ల గాను ప్రస్తుతం 316.07 ఉండగా, నీటి నిల్వ సామర్థ్యం 27.54 టీఎంసీలకు ప్రస్తుతం 22.804 టీఎంసీల మేరకు చేరుకొంది. ఇల్లంతకుంట మండలం అనంతగిరి గ్రామసమీపంలోని అన్నపూర్ణ రిజర్వాయర్‌లో 3.5 టీఎంసీల సామర్థ్యం ఉండగా ప్రస్తుతం 2.96 టీఎంసీలకు చేరుకుంది. అన్నపూర్ణ రిజర్వాయర్ నుంచి ఎగువన ఉన్న సిద్దిపేట జిల్లా రంగనాయకసాగర్‌కు 6,600 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నారు.


ఎస్సారెస్పీ ప్రాజెక్టు


ధర్మపురిలో స్నానఘట్టాల వద్ద గోదావరి ప్రవాహం

### 20 టీఎంసీలకు చేరువలో ఎల్ఎండీ


ఎల్ఎండీ రిజర్వాయర్‌లో నీరు

తిమ్మాపూర్: నిరంతరంగా కురుస్తున్న వర్షాల కారణంగా కరీంనగర్ పరిధిలోని దిగువ మానేరు జలాశయం 20 టీఎంసీల నీటి మట్టానికి చేరుకుంది. ఎల్ఎండీ పూర్తి స్థాయి నీటి మట్టం 24.034 టీఎంసిలకు 19.76టీఎంసిల నీరు ఉంది. వర్షం తగ్గుముఖం పట్టడంతో మోయతుమ్మెద వాగు ఉధృతి తగ్గుముఖం పట్టింది. ప్రస్తుతం ఎల్ఎండిలోకి మోయతుమ్మెద వాగు నుంచి 5,715క్యూసెక్కులు, ఎగువ ఎల్ఎండి నుంచి 1831క్యూసెక్కులు మొత్తం 7,546క్యూసెక్కుల నీరు ఇన్‌ఫ్లో వచ్చి చేరుతుండగా, ఔవుట్ ఫ్లో 290క్యూసెక్కులు ఉంది. ఎంఎంఆర్ నుండి ఎల్ఎండిలోని వస్తున్న ఇన్‌ఫ్లోలను గురువారం నిలిపివేశారు.

### ధర్మపురి వద్ద ఉధృతంగా గోదావరి ప్రవాహం

ధర్మపురి : ధర్మపురి వద్ద గోదావరి నది నీటి ప్రవాహం గురువారం సాయంత్రం వేగంగా కొనసాగింది. గోదావరి నీటి మట్టం క్షణ క్షణం పెరిగి వేగంగా ప్రవాహించింది. స్నానఘట్టాలు నీటిలో మునిగి పోయాయి. భక్తులను లోతు ప్రదేశాలకు వెళ్లి స్నానాలు చేయకుండా అధికారులు అప్రమత్తం చేశారు. తహసీల్దార్ కృష్ణచైతన్య, సీఐ రాంనర్సింహారెడ్డి, వరద పరిస్థితి గురించి ఉన్నతాధికారులకు సమాచారం అందించారు.

### యువకుడి ఆత్మహత్య


ప్రవీణ్(ఫైల్)

సైదాపూర్, సెప్టెంబరు 5: సైదాపూర్ మండలంలోని బొత్తలపల్లి గ్రామానికి చెందిన మెడవేణి ప్రవీణ్(25) అనే యువకుడు ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకొని మృతి చెందాడు. పోలీసులు, కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం.. ప్రవీణ్ కొన్ని రోజులుగా అనారోగ్య సమస్యతో బాధపడుతున్నాడు. బుధవారం రాత్రి ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. కుటుంబ సభ్యులు చూసే సరికి ప్రవీణ్ మృతి చెంది ఉన్నాడు. మృతుడి తండ్రి రాజయ్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తిరుపతి తెలిపారు.

### రాజన్న భక్తురాలి ఆకస్మిక మృతి

వేములవాడ కల్చరల్, సెప్టెంబరు 5: కుటుంబ సమేతంగా రాజన్న దర్శనానికి వచ్చిన కొత్తకొండ విజయ (52) అనే భక్తురాలు గురువారం మృతి చెందారు. రాజన్న దర్శనానికి వచ్చి దర్శించుకుని గదిలోకి వెళ్లే క్రమంలో ఆలయ పరిసర ప్రాంతంలో ఒక్కసారిగా కుప్పకూలింది. వెంటనే బంధువులు వేములవాడ ఏరియా ఆసుపత్రికి తరలించారు. అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతున్న విజయ రాజన్న దర్శనం కోసం కుటుంబసమేతంగా వచ్చారు. మృతురాలది సిద్దిపేట జిల్లా అక్కన్నపేట మండలం చోటపల్లి గ్రామం అని తెలిపారు.

# అధికారులు, ప్రజాప్రతినిధుల ఫోన్లు ట్యాపింగ్

● హుజూరాబాద్ ఎమ్మెల్యే పాడి కౌశిక్‌రెడ్డి

జమ్మికుంట రూరల్, సెప్టెంబర్ 5: అధికారులు, ప్రజాప్రతినిధుల ఫోన్లు ట్యాప్ చేస్తున్నారని హుజూరాబాద్ ఎమ్మెల్యే పాడి కౌశిక్‌రెడ్డి అన్నారు. గురువారం జమ్మికుంట పట్టణంలోని మున్సిపల్ చైర్మన్ తక్కళ్లపల్లి రాజేశ్వర్‌రావు నివాసంలో మీడియా సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా కౌశిక్‌రెడ్డి మాట్లాడుతూ తనతో పాటు కరీంనగర్ సీపీ, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, ఎంపీలు, అధికారుల ఫోన్లు ట్యాపింగ్ చేస్తున్నారని ఆరోపించారు. మానకొండూర్ శాసనసభ్యుడు మంత్రి పొన్నం ప్రభాకర్ ఇంట్లో ఒక ఇంటర్వ్యూ ఇచ్చాడని, అందులో మానకొండూర్ సీఐకి సీపీ టెలికాన్ఫరెన్స్ రావడం లేదని, సీఐతో సీపీ మాట్లాడటం లేదని చెప్పారన్నారు. టెలికాన్ఫరెన్స్ అనేది ఒక ఇంటర్నల్ విషయమని, అలాంటి విషయం ఎమ్మెల్యేకు ఎలా తెలిసిందో సమాధానం చెప్పాలన్నారు. జిల్లాలోని అందరి అధికారుల ఫోన్లు ట్యాప్ అవుతున్నాయన్నారు. ఒక ఐపీఎస్ ఫోన్ ట్యాప్ చేసినపుడు ఎమ్మెల్యేల ఫోన్ ట్యాపింగ్ చేయడం లేదని గ్యారంటీ ఏమిటని ప్రశ్నించారు. తాము పోస్టింగ్‌లు ఇప్పిస్తే సీపీ తీసుకోవడం లేదని ఎమ్మెల్యే చెబుతున్నారన్నారు. ముఖ్యమంత్రి పైరవీలకు తావు లేదని చెప్పాడని, అలాంటపుడు పోస్టింగ్‌లు ఎలా ఇప్పిస్తున్నారో చెప్పాలన్నారు. ఓడిపోయిన వ్యక్తి ఇక్కడ చెక్కులు పంచుతున్నాడన్నారు. ప్రభుత్వ కార్యక్రమాలకు సంబంధించిన ఏ చెక్కు అయినా పంపిణీ చేసేందుకు ఎమ్మెల్యేలకు హక్కు ఉంటుందన్నారు. అవసరమైతే తాను మళ్లీ వెళ్తా అన్నారు. సీపీ ఫోన్ ట్యాపింగ్‌పై కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్‌కుమార్ స్పందించి సీబీఐ విచారణ చేపట్టాలన్నారు. రైతులకు పూర్తి స్థాయిలో రుణమాఫీ జరుగలేదని, కేవలం 40శాతం మంది రైతులకు మాత్రమే రుణమాఫీ జరిగిందని గుర్తు చేశారు. సమావేశంలో సొసైటీ చైర్మన్ పొనగంటి సంపత్, మాజీ మున్సిపల్ చైర్మన్ పోడేటి రామస్వామి, టంగుటూరి రాజ్‌కుమార్, కౌన్సిలర్లు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.


సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కౌశిక్‌రెడ్డి

## ప్రైవేట్ ఉపాధ్యాయుల సంక్షేమ బిల్లు ప్రవేశపెట్టాలి

● యాదగిరి శేఖర్ రావు

కరీంనగర్ టౌన్, సెప్టెంబరు 5: ప్రైవేట్ పాఠశాలల ఉపాధ్యాయుల సంక్షేమ బిల్లును వెంటనే పార్లమెంట్, అసెంబ్లీలో ప్రవేశపెట్టాలని ట్రస్మా మాజీ రాష్ట్ర అధ్యక్షుడు యాదగిరి శేఖర్ రావు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలను ఒక ప్రకటనలో కోరారు. ఉపాధ్యాయులకు 10 లక్షల రూపాయల ఆరోగ్య బీమా, మరో 10 లక్షల రూపాయల జీవిత బీమాను ప్రభుత్వం అందించాలని డిమాండ్ చేశారు. ప్రతి సంవత్సరం 10వ తరగతిలో 10/10 జీపీఏ సాధించే విద్యార్థుల్లో 90శాతం విద్యార్థులు బడ్జెట్ ప్రైవేట్ పాఠశాలల్లో నుంచి వస్తున్నారని అన్నారు. భావి భారత పౌరులను దేశానికి అందిస్తున్నది కూడా బడ్జెట్ ప్రైవేట్ పాఠశాలలేనన్నారు. ప్రభుత్వం ఇప్పటికైనా ప్రైవేట్ పాఠశాలల ఉపాధ్యాయులను ప్రభుత్వ ఉపాధ్యాయులతో సమానంగా గౌరవించి సముచిత స్థానం ఇవ్వాలని ఉపాధ్యాయ దినోత్సవం సందర్భంగా శేఖర్‌రావు ప్రభుత్వాన్ని కోరారు.

### ఐదుగురు పేకాటరాయుళ్ల అరెస్ట్

ఎల్లారెడ్డిపేట, సెప్టెంబరు 5: మండలంలోని తిమ్మాపూర్ గ్రామ శివారు మైసమ్మ చెరువు సమీపంలో పేకాట ఆడుతున్నారనే సమాచారంతో ఎస్ఐ రమాకాంత్ ఆధ్వర్యంలోని పోలీసులు గురువారం దాడి చేశారు. పేకాట ఆడుతున్న తిమ్మాపూర్ గ్రామానికి చెందిన ఐదుగురు వ్యక్తులను అరెస్ట్ చేశామని ఎస్ఐ రమాకాంత్ తెలిపారు. వారి వద్ద నుంచి రూ 14,970 నగదుతో పాటు పేకాటకు సంబంధించిన సామగ్రిని స్వాధీన పర్చుకున్నామని పేర్కొన్నారు. కేసు నమోదు చేసి తహసీల్దార్ ఎదుట బైండోవర్ చేశామని ఎస్ఐ రమాకాంత్ వివరించారు.

### గంజాయి విక్రయిస్తున్న ఇద్దరు యువకుల రిమాండ్

● 150 గ్రాముల గంజాయి స్వాధీనం

ఎల్లారెడ్డిపేట, సెప్టెంబరు 5: మండలంలోని నారాయణపూర్ గ్రామ శివారులో గంజాయి విక్రయించేందుకు వచ్చిన కరీంనగర్ జిల్లా గంగాధర మండల కేంద్రానికి చెందిన యువకులు అఖిల్, ఖాసీంలను పట్టుకుని రిమాండ్‌కు తరలించామని సీఐ శ్రీనివాస్‌గౌడ్ గురువారం తెలిపారు. నారాయణపూర్ గ్రామ శివారులో ఈ నెల 4న ఎస్ఐ రమాకాంత్ ఆధ్వర్యంలోని పోలీసులు వాహన తనిఖీలను చేపట్టారని పేర్కొన్నారు. ఇద్దరు యువకులు బైక్‌పై అనుమానస్పదంగా సంచరిస్తుండగా పట్టుకుని విచారించామని చెప్పారు. వారి వద్ద నుంచి 150 గ్రాముల ఎండు గంజాయితో పాటు ద్విచక్రవాహనాన్ని స్వాధీనపర్చుకున్నామని పేర్కొన్నారు. అఖిల్, ఖాసీంలు గంజాయికి అలవాటు పడి గంగాధర మండలం కాశిరెడ్డిపల్లి గ్రామంలోని యువకుడు మధు వద్ద తక్కువ ధరకు కొనుగోలు చేసి ఎల్లారెడ్డిపేట, సిరిసిల్ల ప్రాంతాల్లో విక్రయిస్తున్నారని తమ విచారణలో అంగీకరించారని తెలిపారు. కేసు నమోదు చేసి నిందితులను రిమాండ్‌కు తరలించామని పేర్కొన్నారు. ఎవరైనా గంజాయి అమ్మినా, సేవించినా తమకు సమాచారం అందిస్తే వారి పేర్లు గోప్యంగా ఉంచుతామని సీఐ శ్రీనివాస్‌గౌడ్ తెలిపారు.

### రోడ్డు ప్రమాదంలో రైతుకు తీవ్రగాయాలు

ఎల్లారెడ్డిపేట, సెప్టెంబరు 5: ఎల్లారెడ్డిపేట గ్రామ శివారులోని కామారెడ్డి-సిరిసిల్ల ప్రధాన రహదారిపై గురువారం రోడ్డు ప్రమాదం జరిగింది. ఈ సంఘటనలో మండలంలోని గొల్లపల్లి గ్రామానికి చెందిన రైతు మారెళ్లి నాగరాజు తీవ్ర గాయాల పాలయ్యాడు. క్షతగాత్రుడిని ఓ ప్రైవేటు వాహనంలో మండల కేంద్రంలోని ఓ ప్రైవేటు ఆసుపత్రికి తరలించారు. అతని పరిస్థితి తీవ్రంగా మారింది. గ్రామంలోని రైతు మారెళ్లి నాగరాజు తనకున్న వ్యవసాయ పొలం వద్ద నుంచి పాడిగేదెలను పశువుల పాక వద్దకు ప్రధాన రహదారి పక్క నుంచి తీసుకెళుతున్నాడు. ఎల్లారెడ్డిపేట నుంచి గొల్లపల్లి వైపుకు వెళ్తున్న ఆటో అతివేగంగా నాగరాజును వెనుక నుంచి ఢీకొట్టింది. దాంతో ఆయన ఎగిరి రోడ్డుపై ఉన్న డివైడర్‌పై పడ్డాడు. తలకు బలమైన గాయాలవడం వల్ల పరిస్థితి తీవ్రంగా ఉందని వైద్యులు పేర్కొన్నారని కుటుంబ సభ్యులు, స్థానికులు పేర్కొన్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నామని పోలీసులు వివరించారు.

## రాజన్న ఆలయంలో గణేశ్ నవరాత్రి ఉత్సవాలు

శనివారం కల్యాణం, అభిషేకం పూజల రద్దు

వేములవాడ కల్చరల్, సెప్టెంబరు 5: వేములవాడ రాజరాజేశ్వర స్వామి వారి ఆలయంలో శనివారం నుంచి 15వ తేదీ ఆదివారం వరకు గణేష్ నవరాత్రి ఉత్సవాలను నిర్వహించనున్నట్లు ఆలయాధికారులు ఒక ప్రకటనలో తెలిపారు. శనివారం వినాయక చవితి సందర్భంగా ఆలయ నాగిరెడ్డి మండపంలో ఉదయం 9.05 గంటలకు పుణ్యాహవాచనము, అఖండ దీపారాదన, సిద్ధి బుద్ధి వినాయక ప్రతిష్ఠ నిర్వహిస్తామన్నారు. వినాయక చవితి రోజున సాయంత్రం 4 గంటలకు శమంతకోపాఖ్యానము చేపట్టనున్నారు. 14వ తేదీన భాద్రపద శుద్ధ ఏకాదశి శనివారం రోజున ఉదయం 9 గంటలకు మహాగణపతి మూలమంత్ర హవనము, సాయంత్రం 7.15 గంటలకు లక్ష్మీగణపతి స్వామి వారికి మహాపూజ, 15వ తేదీన భాద్రపద శుద్ధ ద్వాదశి ఆదివారం రోజున హవనా నంతరం ఉదయం 11 గంటలకు పూర్ణాహుతి, రాత్రి 7.15 గంటలకు పెద్దసేవ ఊరేగింపు అనంతరం గణేశ నిమజ్జనం నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. కాగా వినాయక చవితి సందర్భంగా శనివారం రాజన్న ఆలయంలో నిర్వహించే కల్యాణాలు, అభిషేకాలు రద్దు చేస్తున్నట్లు ఆలయ అధికారులు వెల్లడించారు.

## రేషన్ బియ్యం పట్టివేత

బీర్‌పూర్,సెప్టెంబరు 5: మండలంలోని తుంగూర్ గ్రామంలో అక్రమంగా నిల్వ ఉంచిన రేషన్ బియ్యాన్ని శుక్రవారం రాత్రి పోలీసులు పట్టుకున్నారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం బీర్‌పూర్ మండలకేంద్రానికి చెందిన కోట సంతోష్ అనే వ్యక్తి ప్రభుత్వం పేదలకు పంపిణీ చేసే బియ్యాన్ని కొనుగోలు చేసి తుంగూర్ గ్రామంలో అక్రమంగా నిల్వచేసి తరలించడానికి సిద్ధంగా ఉంచాడు. పోలీసులకు అందిన సమాచారంతో సోదాలు నిర్వహించి 5.5 క్వింటాళ్ల రేషన్ బియ్యాన్ని పట్టుకొని పోలీస్ స్టేషన్‌కు తరలించి నిందితుడు సంతోష్‌పై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై కుమారస్వామి తెలిపారు.

## దంపతుల మధ్య మనస్పర్ధలు

● అత్తగారింటిలో

### వివాహిత బైఠాయింపు

ఎల్లారెడ్డిపేట, సెప్టెంబరు 5: భార్యభర్తల మధ్య మనస్పర్ధల వల్ల కొంతకాలంగా విడివిడిగా ఉంటుంటగా, భార్య నుంచి విడాకులు కావాలని భర్త కోర్టును ఆశ్రయించడంతో పుట్టింటి నుంచి చేరుకున్న వివాహిత అత్తగారింటిలో బైఠాయించింది. ఈ సంఘటన ఎల్లారెడ్డిపేట మండలం వెంకటాపూర్‌లో గురువారం రాత్రి చోటు చేసుకుంది. స్థానికులు, పోలీసుల కథనం మేరకు. గ్రామంలోని ఆంజనేయులుకు బోయినపల్లి మండలం బూరుగుపల్లికి చెందిన కల్యాణితో వివాహమైంది. కొంత కాలం సజావుగా సాగిన వారి కాపురంలో గొడవలు నెలకొన్నాయి. దాంతో కల్యాణి నాలుగేళ్ల కిందట పుట్టింటికి వెళ్లింది. పలుమార్లు పెద్దలు పంచాయితీ నిర్వహించి కలిసి ఉండాలని సూచించినా ఫలితం లేకుండాపోయింది. భార్యాభర్తల మధ్య నెలకొన్న గొడవలతో కోర్టులో కేసు కొనసాగుతోంది. ఈ క్రమంలో భర్త ఆంజనేయులు తన భార్య నుంచి విడాకులు కావాలని నోటీసులు పంపించడంతో కల్యాణి పుట్టింటి నుంచి వెంకటాపూర్‌లోని అత్తగారింటికి చేరుకుంది. తాను ఇక్కడే ఉంటానని భీష్మించుకు కూర్చుంది. సమాచారం అందుకున్న పోలీసులు అక్కడకు చేరుకున్నారు. గొడవలు చోటు చేసుకోకుండా ఇరువర్గాలకు నచ్చజెప్పారు.

# రాష్ట్రంలో హైడ్రా పేరుతో డ్రామా నడుస్తోంది..

- సీపీఐ జాతీయ కార్యవర్గ సభ్యుడు చాడ వెంకటరెడ్డి

పెద్దపల్లి రూరల్, సెప్టెంబరు 5 : రాష్ట్రంలో హైడ్రా పేరుతో డ్రామా నడుస్తోందని సీపీఐ జాతీయ కార్యవర్గ సభ్యుడు చాడ వెంకటరెడ్డి అన్నారు. గురువారం మండలంలోని పెద్దబొంకూరు గ్రామంలో ఆయన విలేకరులతో మాట్లాడారు.. 90 ఏళ్ల క్రితం నైజాం పాలనలో సర్వే నంబర్ల వారీగా సమగ్ర సర్వే నిర్వహించారని, అప్పటి నుంచి నేటివరకు ఆ విధంగా సర్వేలు నిర్వహించలేదన్నారు. రెవెన్యూ చట్టంలో మొదటి ఎజెండాగా సర్వే నంబర్ల వారీగా సర్వే నిర్వహించాలని ఉందని, ఈ విషయంపై మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్‌కు పలుమార్లు విజ్ఞప్తి చేశామన్నారు. ఆయన పట్టించుకోలేదన్నారు. ప్రస్తుతం సీఎం రేవంత్‌రెడ్డి కూడా భూ కమిటీని వేశారని, కమిటీ సభ్యులను కలిసి సర్వే విషయమై వినతిపత్రం అందించామన్నారు. రికార్డులు సరిచేస్తామని చెప్పడమే తప్ప చేపట్టడం లేదన్నారు. ప్రస్తుత ప్రభుత్వం చేస్తున్న హైడ్రాను రాష్ట్రంలోని అన్ని జిల్లాల్లో అమలుచేయాలన్నారు. అక్రమ కట్టడాల్లో ప్రధానంగా రియల్ ఎస్టేట్ వ్యాపారులే ఉన్నారని, వారి నుంచి కొంతమంది ఎమ్మెల్యేలు, ఎంపీలుగా ఎన్నికయ్యారన్నారు. సర్వే నంబర్ల వారీగా సర్వే నిర్వహించి హద్దులు ఏర్పాటు చేయాలని, దీంతో అక్కడ నిర్మించిన కట్టడం అక్రమమని తేలితే ఆధారాలతో కూల్చేస్తే బాగుంటుందన్నారు. ప్రభుత్వ భూములు, చెరువుశిఖం, నాలా వంటి భూములను ఆక్రమిస్తున్నారని, వీటిపై సమగ్ర విచారణ జరిపించాలని, అందులో కూడా పేద కుటుంబాలు ఉంటాయని వారికి ప్రత్యామ్నాయంగా ఇళ్లు కట్టించాలన్నారు. 2లక్షల రుణమాఫీ విషయంలో ప్రతి రైతుకు వర్తింపజేయాలన్నారు. సమావేశంలో సీపీఐ జిల్లా కార్యదర్శి తాండ్ర సదానందం, సహాయ కార్యదర్శి గోషిక మోహన్, గౌతం గోవర్ధన్, మడికొండ ఒడెమ్మ, పోడం స్వామి, సూర్య పాల్గొన్నారు.


పెద్దబొంకూరులో విలేకరులతో మాట్లాడుతున్న చాడ వెంకటరెడ్డి

### సైబర్‌క్రైం కేసు నమోదు

బోయినపల్లి, సెప్టెంబర్ 5: ఓ వ్యక్తికి చెందిన కరెంట్ అకౌంట్ సిమ్ కార్డు తీసుకొని ఎక్కువ మొత్తంలో బ్యాంక్ ద్వారా లావాదేవీలు జరిపిన సంఘటనపై ఖాతాదారుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు గురువారం బోయినపల్లి ఎస్ఐ పృథ్వీధర్ గౌడ్ తెలిపారు. వివరాల ప్రకారం నీలోజిపల్లి గ్రామానికి చెందిన ఎరుకల కిషన్ అతని కరెంట్ అకౌంట్ సిమ్ కార్డు గుర్తుతెలియని వ్యక్తి తీసుకొని పెద్ద మొత్తంలో లావాదేవీలు నిర్వహించినట్లు పోలిసులకు ఫిర్యాదు చేశాడు. ఫిర్యాదు దారుడితో పాటు కరీంనగర్‌కు చెందిన మరో వ్యక్తిచే కరెంట్ అకౌంట్ ఓపెన్ చేయించి గుర్తుతెలియని వ్యక్తులు లావాదేవీలు నిర్వహించినట్లు సమాచారం.

### చికిత్స పొందుతూ యువకుడి మృతి

గంభీరావుపేట సెప్టెంబరు 5: గంభీరావుపేట మండల కేంద్రానికి సమీపాన ఇటీవల జరిగిన రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన కందుకూల నవీన్ (27) చికిత్స పొందుతూ గురువారం మృతి చెందాడు. మల్లారెడ్డిపేటకు చెందిన నవీన్ 22 రోజుల క్రితం ద్విచక్ర వాహనంపై వెళ్తూ రోడ్డు ప్రమాదానికి గురయ్యాడు. హైదరాబాదులోని నిమ్స్ ఆసత్రితో చికిత్స పొందుతూ మృతి చెందాడు.

# ఉత్సాహంగా తీజ్ సంబరాలు

● తొమ్మిది రోజుల పాటు బంజారాల వేడుక


తీజ్ ఉత్సవాల్లో పాల్గొన్న నాయకులు


సిరిసిల్లలోని కళాశాల మైదానంలో సంబరాలు

సిరిసిల్ల, సెప్టెంబరు 5 (ఆంధ్రజ్యోతి): అచార వ్యవహారాలే ప్రాణంగా బంజారాల సంస్కృతి సంప్రదాయాలకు ప్రతీకగా నిలిచే తీజ్ ఉత్సవాలను ఆటపాటలతో గిరిజనులు ఎంతో సంబురంగా జరుపుకున్నారు. గురువారం రాజన్నసిరిసిల్ల జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల మైదానంలో బంజారా సేవాలాల్ సంఘం ఆధ్వర్యంలో గిరిజనులు తొమ్మిది రోజుల పాటు వేడుకలు జరుపుకొని చివరిరోజు మానేరు తీరం వరకు తీజ్ నిమజ్జనం చేశారు. బతుకమ్మ తరహాలో జరిగే తీజ్ వేడుకలు తొమ్మిది రోజుల పాటు నాలుగు దశలుగా జరుపుకున్నారు. మొదటగా తీజ్ బోరా యేరో బుట్టల్లో గోధుమలను చల్లడం, రెండవది కడావో దేవతకు నైవేద్యం సమర్పించడం, మూడవది గన్‌కోర్ అంటే మేరామా, సేవాలాల్‌ల పెండ్లి, నాలుగోవది గోధుమ నారును చెరువులో వదలడం వేరా యేరోగా పిలిచే వేడుకలను వైభవంగా జరుపుకున్నారు. బుట్టలతో గిరిజన యువతులు, మహిళలు ఆటలు, పాటలతో నృత్యాలు చేస్తూ వెళ్లారు. నానబెట్టిన బుట్టల్లో పెరిగిన గోదుమ నారు ను అన్నదమ్ములకు పంచారు. వైభవోపేతంగా జరుపుకున్న తీజ్ వేడుకల్లో అదనపు కలెక్టర్ ఖీమ్యా నాయక్, కాంగ్రెస్ నియోజకవర్గ ఇన్‌చార్జి కేకే మహేందర్‌రెడ్డి, మున్సిపల్ చైర్‌పర్సన్ జిందం కళచక్రపాణి, సీఐ కృష్ణ, వీర్నపల్లి మాజీ జడ్పీటీసీ గుగులోతు కళావతి, రైతు బంధు సమితి మాజీ చైర్మన్ గడ్డం నర్సయ్య, ఎస్సీ సెల్ జిల్లా అధ్యక్షుడు అకునూరి బాలరాజు ఉత్సవాల్లో పాల్గొని గిరిజను లకు శుభాకాంక్షలు తెలిపారు. ఖీమ్యానాయక్, కేకే మహేందర్‌రెడ్డిల బంజారాలు తమ ఉత్సవాలు జరుపుకోవడానికి స్థలం కేటాయింపునకు కృషి చేస్తామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో బంజారా సేవాలాల్ సంఘం ప్రతినిధులు రామిరెడ్డి, దేవ్ సింగ్, గజన్‌లాల్, తిరుపతి, కేపతి, వినోద్, జేత్యా, భూపతి ఉన్నారు.


తీజ్ బుట్టలతో యువతులు

## పోడు భూముల కేసులను ఎత్తివేయాలి

ప్రజాసంఘాల నాయకుల డిమాండ్



సిరిసిల్లలో మాట్లాడుతున్న ప్రజా సంఘాల నాయకులు

సిరిసిల్ల రూరల్, సెప్టెంబరు 5: పోడు భూముల పోరాటాల్లో పాల్గొన్న ప్రజా సంఘాల నాయకులపై పెట్టిన కేసులను రాష్ట్రప్రభుత్వం ఎత్తివేసి అర్హులైన వారందరికి పోడు పట్టాలను అందించాలని ప్రజా సంఘాల నాయకుడు మాల్లారపు అరుణ్‌కుమార్ డిమాండ్ చేశారు. సిరిసిల్ల పట్టణం బీవైనగర్‌లోని సీఐటీయూ కార్యాలయంలో గురువారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో అయన మాట్లాడారు. పోడు రైతుల పక్షాన నిలబడి పేదలకు పోడు భూముల హక్కు పత్రాలు ఇవ్వాలనే న్యాయమైన డిమాండ్‌తో పోరాడిన ప్రజా సంఘాల నాయకులపై అక్రమ కేసులు బనాయించి కోర్టుల చుట్టు తిప్పించడాన్ని ఖండిస్తున్నామన్నారు. పోడు రైతుల పక్షాన నిలబడిన ప్రజాసంఘాల నాయకులపై పెట్టిన కేసులను ఎత్తివేయాలన్నారు. 50 సంవత్సరాల నుంచి పోడు వ్యవసాయం చేసుకుంటున్న ఎస్సీ, ఎస్టీ, బీసీ భూమిలేని నిరుపేద కుటుంబాలకు ప్రభుత్వం వెంటనే సాగు చేసుకునే అవకాశం కల్పించి హక్కు పత్రాలు ఇచ్చేలా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ప్రజాసంఘాల నాయకులు జూలపల్లి మనోజ్‌కుమార్, ఇసంపెల్లి కొమురయ్య, జింక పోషయ్య, గుర్రపు నరేష్, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

● హక్కు పత్రాలను అందించాలి

పోడు భూముల హక్కు పత్రాలు అందించడంతో పాటు పోరాటం చేసిన నాయకులు, రైతులపై పెట్టిన అక్రమ కేసులను రాష్ట్ర ప్రభుత్వం ఎత్తివేసి కోర్టుల నుంచి విముక్తి కల్పించాలని లంబాడీల ఐక్యవేదిక జిల్లా అధ్యక్షుడు నరేష్‌నాయక్ డిమాండ్‌చేశారు. 2005 నుంచి 2022 వరకు గిరిజనులపై పెట్టిన పోడు భూ ముల కేసులను ఎత్తివేస్తామని బీఆర్ఎస్, కాంగ్రెస్ పార్టీలు ఎన్నికల సమయంలో హామీ ఇచ్చారని ఆ హామీలను అమలు చేయడం లేదన్నారు. కేసులతో గిరిజన రైతులపై తీవ్రమైన మానసిక ఒత్తిడి ఉంటుందన్నారు. కార్యక్రమంలో పోడు రైతులు రాజునాయక్, జగన్‌నాయక్, శ్రీనివాస్ నాయక్, ఇందల్ రాథోడ్, ప్రకాష్‌నాయక్ తదితరులు పాల్గొన్నారు.

## బల్దియాలో అధికారులతో కార్పొరేటర్ భర్త వాగ్వాదం

### -పోలీసులకు ఫిర్యాదు చేసిన కమిషనర్

కరీంనగర్ టౌన్, సెప్టెంబరు 5: నగర పాలక సంస్థలో ఓ కార్పొరేటర్ భర్తకు, అధికారులకు మధ్య వాగ్వాదం తారాస్థాయికి చేరుకోవడం చర్చనీయాంశంగా మారింది. గురువారం సాయంత్రం 44వ డివిజన్ కార్పొరేటర్ మెండి శ్రీలత భర్త మెండి చంద్రశేఖర్ టౌన్‌ప్లానింగ్ విభాగానికి వెళ్లి తాను రెండు నెలల క్రితం ఇచ్చిన ఫిర్యాదుకు ఎందుకు చర్యలు తీసుకోవడం లేదని టీపీఎస్ తేజస్విని ప్రశ్నించడంతో వారిద్దరి మధ్య వాగ్వాదం చోటు చేసుకున్నట్లు తెలిసింది. దీనితో టీపీఎస్ తేజస్విని కంటతడి పెట్టుకుంటూ తన ఛాంబర్‌లో జరిగిన విషయాన్ని కమిషనర్ చాహత్ బాజ్‌పాయ్ దృష్టికి తీసుకెళ్లేందుకు కమిషనర్ ఛాంబర్‌కు వెళ్ళారు. ఆ సమయంలో కమిషనర్ స్వశక్తి మహిళా సమైక్య సంఘాల సభ్యుల సమావేశంలో పాల్గొని ఛాంబర్‌కు తిరిగి వస్తుండగా టీపీఎస్ కూడా ఛాంబర్‌లోకి వెళ్లారు. అదే సమయంలో కార్పొరేటర్ భర్త మెండి చంద్రశేఖర్ కూడా కమిషనర్ గదికి వెళ్ళి కమిషనర్‌కు జరిగిన విషయాన్ని చెప్పే క్రమంలో వారి మధ్య కూడా కొంత వాగ్వాదం చోటు చేసుకున్నట్లు ఉద్యోగులు చర్చించుకుంటున్నారు. ఈ విషయాన్ని సీరియస్‌గా తీసుకున్న కమిషనర్ చాహత్ బాజ్‌పాయ్, టిపిఎస్ తేజస్వినితో పాటు ఇతర అధికారులను వెంటబెట్టుకొని కలెక్టర్‌ను కలిసి ఫిర్యాదు చేశారని, ఆ తర్వాత పోలీసు ఉన్నతాధికారులను కూడా కలిసి ఫిర్యాదు చేసినట్లు తెలిసింది.

## మహిళా సమైక్య సంఘాల పనితీరు మెరుగుపడాలి

కరీంనగర్ టౌన్, సెప్టెంబరు 5: నగరంలోని మహిళా సమైక్య సంఘాల పనితీరును మరింత మెరుగుపరచాలని మున్సిపల్ కమిషనర్ చాహత్ బాజ్‌పాయ్ అధికారులకు సూచించారు. గురువారం నగరపాలక సంస్థ సమావేశ మందిరంలో మెప్మా అధికారులు, సిబ్బందితో సమీక్ష సమావేశం నిర్వహించారు. రికార్డులను పరిశీలించి, పలు సంఘాల్లో అవినీతి అక్రమాలు జరుగుతున్నట్లు వచ్చిన అవకతవకలపై ఆరా తీశారు. సమావేశంలో డిసి స్వరూపరాణి, టిఎంసి అనిత, సీవోలు, టిఎల్ఎఫ్ పాల్గొన్నారు.

## ఆర్యవైశ్య మహాసభ వివాహ పరిచయ వేదిక జిల్లా కమిటీ చైర్మన్‌గా రాచమల్ల భద్రయ్య



కరీంనగర్ టౌన్, సెప్టెంబరు 5: ఆర్యవైశ్య మహాసభ వివాహ పరిచయ వేదిక జిల్లా కమిటీ చైర్మన్‌గా కరీంనగర్‌కు చెందిన రాచమల్ల భద్రయ్య నియమితులయ్యారు. గురువారం ఆయనకు ఆర్యవైశ్య మహాసభ జిల్లా అధ్యక్షుడు కన్న కృష్ణ, ప్రధాన కార్యదర్శి కొమురవెల్లి వెంకటేశం, కోశాధికారి పడకంటి శ్రీనివాస్ చేతుల మీదుగా నియామక పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా భద్రయ్య (బద్రి)జిల్లాలోని ఆర్యవైశ్య వధూవరుల పరిచయ వేదికలను నిర్వహించడం ద్వారా వారి వివాహాలకు సహకరించేందుకు కృషిచేస్తానని తెలిపారు. కార్యక్రమంలో ఆర్యవైశ్య సంఘం మాజీ పట్టణ అధ్యక్షుడు గుండ చంద్రమౌళి, వాసవీ సేవాదళ్ అధ్యక్షుడు ఎలగందుల మునీందర్, జిల్లా యువజన సంఘం అధ్యక్షుడు జిడిగె సాయికృష్ణ, రాజకీయ కమిటీ చైర్మన్ రామిడి శ్రీధర్, శ్రీవాసవికన్యకాపరమేశ్వరి దేవాలయ ప్రధాన కార్యదర్శి కాచం రాజేశ్వర్, కోశాధికారి బొల్లం శ్రీనివాస్, ఆలయ డైరెక్టర్లు పాల్తెపు శ్రీనివాస్, రామిడి శ్రీనివాస్, పాల్తెపు మల్లికార్జున్, సాయినగర్ ఆర్యవైశ్య అభ్యుదయ సంఘం ప్రధాన కార్యదర్శి తొడుపునూరి సురేశ్ పాల్గొన్నారు.

## ప్రణాళికతో చదివితే ప్రభుత్వ ఉద్యోగం సాధ్యమే

### -పోటీ పరీక్షల నిపుణుడు ప్రసన్న హరికృష్ణ



స్టడీ మెటీరియల్‌ను అందిస్తున్న ప్రసన్న హరికృష్ణ

కరీంనగర్ కల్చరల్, సెప్టెంబరు 5: పోటీ పరీక్షల సిలబస్‌పై పూర్తి అవగాహన పెంచుకొని ప్రణాళికతో చదివితే ప్రతిఒక్కరూ ప్రభుత్వ ఉద్యోగం సాధించవచ్చని విన్నర్స్ పబ్లికేషన్స్ అధినేత, పోటీ పరీక్షల నిపుణుడు ప్రసన్న హరికృష్ణ పిలుపునిచ్చారు. సాహితి ఫౌండేషన్ ఎన్‌జీఓ ఆధ్వర్యంలో గురువారం కరీంనగర్ కేంద్ర గ్రంథాలయంలో ఏర్పాటు చేసిన పోటీ పరీక్షల అవగాహన సదస్సుకు ప్రసన్న హరికృష్ణ ముఖ్య అతిథిగా హాజరై ప్రసంగించారు. ఉమ్మడి జిల్లా నిరుద్యోగులకు పోటీ పరీక్షల అప్ డేట్స్ అందించేందుకు 8919202956 వాట్సప్ నెంబర్‌ను ఏర్పాటు చేసామన్నారు. సదస్సుకు హాజరైన 1000మంది విద్యార్థులకు స్టడీ మెటీరియల్‌తో ఆన్‌లైన్ కోర్స్‌ను ఉచితంగా అందజేశారు. ఈ సదస్సుకు జిల్లా గ్రంథాలయాల సంస్థ సెక్రెటరీ ఎ.సరిత, లైబ్రేరియన్ సరిత, శాతవాహన యూనివర్సిటీ రిజిస్ట్రార్ కిషోర్ కుమార్, రైట్ ఛాయిస్ అకాడమీ చైర్మన్ కిరణ్‌కుమార్, పోటీ పరీక్షల నిపుణులు మహిపాల్‌రెడ్డి, ప్రవీణ్ కుమార్, కరీం, రాజు, ఇంపాక్ట్ ట్రైనర్, సైకాలజిస్ట్ అనిత, సాహితి ఫౌండేషన్ బాధ్యులు సంతోష్, శ్రీచైతన్య డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ శ్రీనివాస్ పాల్గొన్నారు.

## ఫొటో అండ్ వీడియోగ్రాఫర్స్ అసోసియేషన్ ఎన్నికలు

హుజూరాబాద్, సెప్టెంబరు 5: హుజూరాబాద్ మండల ఫొటో అండ్ వీడియోగ్రాఫర్స్ అసోసియేషన్ ఎన్నికలు గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా గౌరవ సలహాదారు అయిత రాజేందర్, జిల్లా అధ్యక్షుడు సిరి రవి, ప్రధాన కార్యదర్శి తుమ్మ చందుల ఆధ్వర్యంలో ఎన్నికలు నిర్వహించారు. అధ్యక్షుడిగా మాచర్ల రాజు, ప్రధాన కార్యదర్శిగా దూలం చిరంజీవి, ఉపాధ్యక్షులుగా ఎండీ యాకుబ్‌అలీ, ఎడ్ల కుమార్, కోశాధికారిగా కొయ్యడ శ్రీశైలం, సహాయ కార్యదర్శులుగా రమేష్, రాజేష్, ఆర్గనైజర్ సెక్రటరీలుగా భిక్షపతి, శ్రీధర్, కార్యవర్గ సభ్యులుగా మధుకర్, అశోక్, రమేష్ ఎన్నికయ్యారు.

## ప్రభుత్వ డిగ్రీ కళాశాల అసిస్టెంట్ ప్రొఫెసర్‌కు డాక్టరేట్



గొడిశాల పరమేష్

హుజూరాబాద్, సెప్టెంబరు 5: హుజూరాబాద్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో అసిస్టెంట్ ప్రొఫెసర్‌గా పనిచేస్తున్న గొడిశాల పరమేష్ గురువారం డాక్టరేట్ పట్టా పొందారు. ఉస్మానియా యూనివర్సిటీలో 'మధ్య తరహా రిజర్వాయర్లలో చేపల ఉత్పత్తి పెంపుదల ఉన్న అవకాశాలు, సవాళ్లు.' 'ఏ కేస్ స్టడీ ఆఫ్ రంగనాయక సాగర్, మిడ్ మానేర్ డ్యామ్' అనే శీర్షికపై ప్రొఫెసర్ రెడ్యానాయక్ పర్యవేక్షణలో పరిశోధన చేశారు. ఈ సందర్భంగా పరమేష్‌కు పీహెచ్‌డీ డాక్టరేట్ పట్టా అందజేశారు. కళాశాల తోటి అధ్యాపకులు పరమేష్‌ను అభినందించారు.

## మహిళపై దాడి చేసిన నిందితుడిని కఠినంగా శిక్షించాలి

గన్నేరువరం, సెప్టెంబర్ 5: ఆసిఫాబాద్‌లో ఆదివాసీ మహిళపై లైంగిక దాడి చేసిన వ్యక్తిని కఠినంగా శిక్షించాలని బీజేపీ మానకొండూరు నియోజకవర్గ అసెంబ్లీ కన్వీనర్ ముత్యాల జగన్‌రెడ్డి డిమాండ్ చేశారు. గురువారం మండల కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. వర్షాల సందర్భంగా కేంద్ర ప్రభుత్వం ఎన్‌డీఆర్ఎఫ్ నిధులు 1,345 కోట్లు మంజూరు చేస్తూ, రూ.208 కోట్లు వినియోగానికి ఆదేశాలు చేయడం సంతోషకరమని అన్నారు. నిధులు మంజూరుకు కృషి చేసిన కేంద్ర సహాయమంత్రి బండి సంజయ్, కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డిలకు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో బీజేపీ మండల అధ్యక్షుడు నగునూరి శంకర్ నాయకులు మునిగంటి సత్తయ్య, కుర్ర హరీష్, పుల్లెల రాము పాల్గొన్నారు.

## వరద ఉధృతి ఉన్నప్పుడు వాగు దాటొద్దు : ఏసీపీ

శంకరపట్నం, సెప్టెంబరు 5: అర్కండ్ల వాగు వరద ఉధృతి ఉన్నప్పుడు బ్రిడ్జిపై నుంచి వాగు దాటవద్దని రైతులు, కన్నాపూర్, అర్కండ్ల గ్రామస్థులకు ఏసీపీ శ్రీనివాస్‌జీ సూచించారు. గురువారం శంకరపట్నం మండలంలోని అర్కండ్ల వాగు వరద ఉధృతిని ఆయన పరిశీలించారు. సమీపంలో ఉన్న రైతులతో మాట్లాడారు. ప్రమాదాలు జరగకుండా అప్రమత్తంగా ఉండాలన్నారు. కార్యక్రమంలో హుజూరాబాద్ రూరల్ సీఐ వెంకట్, ఎస్ఐ రవి, రైతులు పాల్గొన్నారు.

## కాంట్రాక్టర్ నిర్లక్ష్యంతో కోతకు గురైన వరి పంట

### ● నష్టపరిహారం చెల్లించాలని రైతు డిమాండ్

శంకరపట్నం, సెప్టెంబరు 5: జాతీయ రహదారి విస్తరణ పనులు చేస్తున్న కాంట్రాక్టర్ నిర్లక్ష్యం వల్ల తన వరి పంట కోతకు గురై నష్టం వాటిల్లిందని రైతు ఆవేదన చెందాడు. శంకరపట్నం మండలం కేశవపట్నం గ్రామానికి చెందిన చెన్నవేని మల్లేశం తెలిపిన వివరాల ప్రకారం... కేశవపట్నం శివారులో వాగు పక్కకు వరి పంట సాగు చేస్తున్నట్లు తెలిపారు. కరీంనగర్-వరంగల్ జాతీయ రహదారి విస్తరణ పనులు నిర్వహిస్తున్న కాంట్రాక్టర్ నిర్లక్ష్యం వలనే తన పంటకు నష్టం వాటిల్లిందన్నారు. కేశవపట్నం వాగు ఇంతకు ముందు ఉన్న చోట సదరు కాంట్రాక్టర్ మట్టి పోయడం వల్లనే వరద నీరు తన పొలంలోకి రావడంతో పొలం కోతకు గురైందని తెలిపాడు. నష్టపరిహారం అందించి ఆదుకోవాలని ప్రభుత్వాన్ని కోరాడు.

# ఘనంగా ఉపాధ్యాయ దినోత్సవం







అల్ఫోర్స్ చైర్మన్ నరేందర్‌రెడ్డిని సన్మానిస్తున్న ఉపాధ్యాయులు, సెయింట్‌జార్జ్‌లో ఉపాధ్యాయులను సన్మానించిన చైర్మన్ ఫాతిమారెడ్డి, బిర్లా ఓపెన్‌మైండ్ స్కూల్‌లో వేడుకలు

కరీంనగర్ టౌన్, సెప్టెంబరు 5: జిల్లాలోని ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలల్లో గురువారం ఉపాధ్యాయ దినోత్సవం ఘనంగా నిర్వహించారు. ఈసందర్భంగా పలు పాఠశాలల్లో ఉత్తమ సేవలందిస్తున్న పలువురు ఉపాధ్యాయులను ఘనంగా సన్మానించారు.

●ప్రభుత్వ ఉన్నతపాఠశాల (ఓల్డ్)లో అలయన్స్‌క్లబ్ ఆధ్వర్యంలో ఉపాధ్యాయ దినోత్సవాన్ని నిర్వహించి ఉపాధ్యాయులను సన్మానించారు. ఈ కార్యక్రమంలో అలయన్స్‌క్లబ్ ఆఫ్ ఇంటర్నేషనల్ సభ్యులు డాక్టర్ ఎ.శ్రీనివాస్, ఈద కుమారస్వామి, కోల అన్నారెడ్డి, గాలిపల్లి నాగేశ్వర్, సిహెచ్.వెంకటేశ్వర్, శ్రీనివాస్, మహేశ్ ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

●ప్రభుత్వ ఉన్నత పాఠశాల (కార్ఖానగడ్డ)లో 22 మంది ఉపాధ్యాయులను సన్మానించారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు సత్యనారాయణచారి పాల్గొన్నారు. సీనియర్ సిటిజన్స్ డే కేర్ సెంటర్‌లో ఉపాధ్యాయ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించి రిటైర్డు ప్రిన్సిపాల్ తోట లక్ష్మణ్‌రావును సీనియర్ సిటిజన్స్ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షుడు సముద్రాల జనార్దన్‌రావు ఆధ్వర్యంలో సన్మానించారు. కార్యక్రమంలో ప్రధాన కార్యదర్శి కేశవరెడ్డి, ఉపాధ్యక్షులు మోసం అంజయ్య, ఉప్పల రామేశం, చింతల సత్యనారాయణ పాల్గొన్నారు.

●పారమిత విద్యాసంస్థల్లో నిర్వహించిన కార్యక్రమంలో విద్యాసంస్థల అధినేత డాక్టర్ ఇ.ప్రసాదరావు, డైరెక్టర్లు ప్రసూన, రష్మిత, అనూకర్‌రావు, రాకేశ్, వియుఎం ప్రసాద్, టిఎస్‌వి రమణ, వినోద్‌రావు, హన్మంతరావు పాల్గొన్నారు.

●సిద్ధార్థ విద్యాసంస్థల్లో పాఠశాల చైర్మన్ దాసరి శ్రీపాల్‌రెడ్డి డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ చిత్రపటానికి పూలమాలవేసి వేడుకలను ప్రారంభించారు. ఉపాధ్యాయులకు ఆటల పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులను ప్రదానం చేశారు.

●అద్వితా ఇంటర్నేషనల్ స్కూల్‌లో నిర్వహించిన కార్యక్రమంలో చైర్మన్ సౌగాని కొమురయ్య, మేనేజింగ్ డైరెక్టర్ అనుదీప్ సౌగాని పాల్గొన్నారు. సెయింట్ పాల్స్ ఉన్నత పాఠశాలలో నిర్వహించిన కార్యక్రమంలో చైర్మన్ రాజ్‌కుమార్, ప్రిన్సిపాల్ లీన ప్రియదర్శిని పాల్గొన్నారు. భగవతి ఆర్కిడ్ ట్రీ స్కూల్‌లో నిర్వహించిన కార్యక్రమంలో పాఠశాల చైర్మన్ బి. రమణారావు, కరస్పాండెంట్ బి.విజయలక్ష్మి పాల్గొన్నారు. సాధన స్కూల్ ఆఫ్ ఎక్సలెన్స్‌లో చైర్మన్ చింతపల్లి శ్రీనివాస్‌రావు ఆధ్వర్యంలో వేడుకలను నిర్వహించారు. బ్లూబెల్స్ పాఠశాలలో జరిగిన వేడుకల్లో ప్రిన్సిపాల్ జంగ సునిత పాల్గొన్నారు.

●కోరా జాన్సన్ పాఠశాలలో నిర్వహించిన కార్యక్రమంలో చైర్మన్ మహిపాల్‌రెడ్డి, డైరెక్టర్లు వరప్రసాద్, రాంరెడ్డి సింహచలం హరిక్రిష్ణ, వంగళ సంతోష్‌రెడ్డి పాల్గొన్నారు. అచీవర్స్ యాక్టివ్ పాఠశాలలో అసోసియేషన్ ఆఫ్ అలయన్స్ క్లబ్ ఇంటర్నేషనల్ డిస్ట్రిక్ట్ 137ఎ సంయుక్తంగా ఉపాధ్యాయ దినోత్సవం నిర్వహించారు. కార్యక్రమంలో పాఠశాల డైరెక్టర్ సిహెచ్ వెంకటేశ్వర్లు, ప్రిన్సిపాల్ పల్లవి, డాక్టర్ ఎ.శ్రీనివాస్, ఈద కుమారస్వామి పాల్గొన్నారు.

●జిల్లాకాంగ్రెస్ మైనార్టీ సెల్ ఆధ్వర్యంలో నగరంలోని 54వ డివిజన్ కశ్మీరుగడ్డ ఉర్దూ మీడియం పాఠశాలలో ఐదుగురు ఉపాధ్యాయులను సన్మానించి సత్కరించారు. ఈకార్యక్రమంలో జిల్లా కాంగ్రెస్ మైనార్టీ సెల్ చైర్మన్ మహ్మద్ తాజొద్దీన్, నాయకులు నిహాల్ అహ్మద్, జమీల్ అహ్మద్, ఎండి.ఫిరోజ్ సాజిద్, ఎండి.సలీం, హనీఫ్ రజీ, మతిన్ పాల్గొన్నారు. బ్లూమింగ్ ఒకేషనల్ జూనియర్ కళాశాలలో నిర్వహించిన కార్యక్రమంలో వినియోగదారుల ఫోరం జిల్లా అధ్యక్షుడు పి.రామారావు, కరస్పాండెంట్ ఎంఎ ఖుద్దూస్ పాల్గొన్నారు.

●**భగత్‌నగర్:** ప్రతి విద్యార్థికి ఉపాధ్యాయులే మార్గదర్శకులని అల్ఫోర్స్ విద్యాసంస్థల చైర్మన్ డాక్టర్ వి.నరేందర్‌రెడ్డి అన్నారు. గురువారం కొత్తపల్లి అల్ఫోర్స్ ఈ-టెక్నో పాఠశాలలో ఉపాధ్యాయ దినోత్సవాన్ని పురస్కరించుకుని గురువందన్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈసందర్భంగా నరేందర్ రెడ్డిని ఉపాధ్యాయులు ఘనంగా సత్కరించారు.

●**భగత్‌నగర్:** విద్యార్థి ఉన్నతిలో ఉపాధ్యాయుల పాత్ర వెలకట్టలేనిదని సెయింట్‌జార్జ్ (సిబిఎస్ఈ), పారడైజ్ పాఠశాలల చైర్మన్ డాక్టర్ పి ఫాతిమారెడ్డి అన్నారు. గురువారం పాఠశాలలో ఉపాధ్యాయ దినోత్సవం నిర్వహించారు. కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్ భార్గవ్, వసంత, నిరంజన్, వైస్ ప్రిన్సిపాల్ మధు, ప్రసాద్‌రెడ్డి పాల్గొన్నారు.

●బస్టాండ్ ఆవరణలో ఆర్ఎం సుచరిత ఆధ్వర్యంలో రోజు వారీగా ఆర్టీసీలో ప్రయాణించే ఉపాధ్యాయులు సురేష్, సుమతి, కె మాధురిలను ఘనంగా సత్కరించారు.

●**గణేశ్‌నగర్:** ఎస్ఆర్ఆర్ ప్రభుత్వ ఆర్ట్స్ , సైన్స్ కళాశాలలో ఎన్ఎస్ఎస్ ఆధ్వర్యంలో ఉపాధ్యాయ దినోత్సవం నిర్వహించారు.ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ వై సత్యనారాయణ పాల్గొన్నారు.

●వివేకానంద డిగ్రీ, పీజీ కళాశాలలో నిర్వహించిన కార్యక్రమంలో ప్రిన్సిపాల్ శ్రీనివాస్, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం అధికారి ధనపురి సాగర్ పాల్గొన్నారు.

●**సుభాష్‌నగర్:** జిల్లా కేంద్రంలోని మెడికవర్ ఆసుపత్రిలో ఎస్ఆర్ఆర్ ప్రిన్సిపాల్ సత్యనారాయణతో పాటు లెక్చరర్లను సన్మానించారు. కార్యక్రమంలో ఆసుపత్రి సెంటర్ హెడ్ గుర్రం కిరణ్, డాక్టర్ కిరణ్‌కుమార్, డాక్టర్ పబ్బ అనీష్, డాక్టర్ రాంచందర్, డాక్టర్ దిలిప్‌రెడ్డి, నాగరాజు పాల్గొన్నారు.

●వాసవీ వాగ్దేవి వనితక్లబ్ ఆధ్వర్యంలో ఉపాధ్యాయ దినోత్సవాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో క్లబ్ అధ్యక్షురాలు మాడిశెట్టి ఉమాదేవి తిరుపతమ్మ, సుధాకర్, మాడిశెట్టి గోపాల్, ఉపాధ్యాయులు వసుందర, శ్రీలత, జ్యోతి, సవేరా, సుధారాణి, రమాదేవి, రేఖశ్రీ తదితరులు పాల్గొన్నారు.

●**కరీంనగర్ రూరల్:** కరంనగర్ మండలం బొమ్మకల్ గ్రామంలోని బిర్లా ఓపెన్ మైండ్ ఇంటర్నేషనల్ స్కూల్‌లో ఉపాధ్యాయ దినోత్సవం నిర్వహించారు. కార్యక్రంలో పాఠశాల చైర్మన్ ప్రశాంత్ రెడ్డి, ప్రిన్సిపాల్ బబిత విశ్వనాథన్ పాల్గొన్నారు.

●**హుజూరాబాద్:** హుజూరాబాద్ పట్టణంలోని ఏకశిల, అల్ఫోర్స్, ప్రభుత్వ పాఠశాల, జూనియర్ కళాశాలలో ఉపాధ్యాయ దినోత్సవం నిర్వహించారు. పలువురు ఉపాధ్యాయులను సన్మానించారు.

●**ఇల్లందకుంట:** శ్రీరాములపల్లి ప్రాథమిక పాఠశాలలో కాంగ్రెస్ పార్టీ మండలాధ్యక్షుడు ఇంగిలే రామారావు ఉపాధ్యాయులను సన్మానించారు.

●**జమ్మికుంట:** జమ్మికుంట పట్టణంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఉపాధ్యాయ దినోత్సవాన్ని నిర్వహించారు. కాకతీయ జూనియర్ కళాశాల, గాయత్రి డిగ్రీ కళాశాలలో నిర్వహించిన కార్యక్రమాల్లో ప్రభుత్వ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ బి రమేష్, గాయత్రి కళాశాల కరస్పాండెంట్ ముష్క వీర్రాజు పాల్గొన్నారు.

●**గంగాధర:** గంగాధరలో ఉపాధ్యాయ దినోత్సవాన్ని ఆయా పాఠశాలల్లో ఘనంగా నిర్వహించారు. గర్షకుర్తి జడ్పీహెచ్ఎస్ పాఠశాలలో లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో మొక్కలు నాటారు.

●**చొప్పదండి:** మండలంలో ఉపాధ్యాయ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. నవోదయ విద్యాలయం, చొప్పదండి జడ్పీ బాలుర.పాఠశాలతో పాటు ప్రభుత్వ,ప్రైవేట్ పాఠశాలలో ఉపాధ్యాయ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు.

●**రామడుగు:** మండల వ్యాప్తంగా ఉపాధ్యాయ దినోత్సవ వేడుకలు ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలల్లో ఘనంగా జరిగాయి. మండలంలోని గోపాల్‌రావుపేట గ్రామంలోని జెడ్పీహెచ్ఎస్ పాఠశాలలోని ఉపాధ్యాయులను లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో సన్మానించారు. కార్యక్రమంలో మాజీ జోన్ చైర్మన్ కర్ర శ్యాంసుందర్‌రెడ్డి, మాజీ రీజియన్ చైర్మన్ మధుసూదన్‌రెడ్డి, లయన్స్ క్లబ్ అధ్యక్షుడు కర్ర ప్రభాకర్‌రెడ్డి పాల్గొన్నారు.

●**వీణవంక:** మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలతో పాటు తెలంగాణ ఆదర్శ పాఠశాల, కేజీబీవీ పాఠశాల, వివిధ పాఠశాలల్లో టీచర్స్ డే వేడుకలు ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ కొల్ల రాజిరెడ్డి కేజీబీవీ ప్రత్యేకాధి కారి లావణ్య, ఆదర్శ పాఠశాల ప్రిన్సిపాల్ వేణు గోపాల్‌రెడ్డి, భాస్కర్, రాంమోహన్, రవీందర్, కరుణ,స్వప్న, జయపాల్ రెడ్డి, సుమలత,శైలజ తదితరులున్నారు.

## మృతుడి కుటుంబానికి ఎమ్మెల్యే పరామర్శ

కరీంనగర్ రూరల్, సెప్టెంబరు5: కరీంనగర్ మండలం ఎలబోతారం గ్రామానికి చెందిన మాజీ సర్పంచ్ భర్త టీఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకుడు కట్ల గౌతమ్ రెడ్డి గత నాలుగు రోజుల కిందట గుండె పోటుతో మృతి చెందాడు. విషయం తెలిసిన ఎమ్మెల్యే గంగుల కమలాకర్ గురువారం మృతుని ఇంటికి వెళ్ళి ఆయన కుటుంబ సభ్యులను పరామర్శించి ప్రగాడ సానుభూతి తెలిపారు. ఆయన వెంట కరీంనగర్ ఫ్యాక్స్ చైర్మన్ శ్యాంసుందర్ రెడ్డి, మాజీ ఎంపీటీసీ సభ్యులు చల్ల రామక్క, లింగారెడ్డి తదితరులు ఉన్నారు.

## నేడు ఓటరు జాబితా ప్రదర్శన

కరీంనగర్ రూరల్, సెప్టెంబరు 5: మండలంలో పలు గ్రామాల్లో వార్డుల వారీగా శుక్రవారం ఓటరు జాబితాను ప్రదర్శించనున్నారు. కరీంనగర్ మండలంలో మొత్తం 17 గ్రామ పంచాయతీలు ఉండగా 170 వార్డులు ఉన్నాయి. ఇందులో మొత్తం 40,144 మంది ఓటర్లు ఉండగా పురుషులు 19,670, మహిళలు 20,488 మంది థర్డ్ జెండర్1 ఉన్నారు. శుక్రవారం గ్రామ పంచాయతీల్లో వార్డుల వారీగా ఫొటో ఓటరు జాబితా ప్రదర్శన, 7 నుంచి 13వరకు ఓటరు జాబితాపై అభ్యంతరాల స్వీకరణ, 10న మండలస్థాయి అన్ని రాజకీయ పార్టీల నాయకులతో ఎంపీడీవో సమావేశం, 18న డీపీవో స్థాయిలో అభ్యంతరాల పరిష్కారం, 21న వార్డుల వారీగా తుది ఓటరు జాబితా విడుదల చేయనున్నారు.

## నియోజకవర్గ అభివృద్ధికి కృషి

### ● చొప్పదండి ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం



రామడుగులో జెండా ఊపి బ్రిడ్జిపై రాకపోకలు ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే

రామడుగు, సెప్టెంబర్ 5 : చివరి శ్వాస వరకు నియోజకవర్గ అభివృద్ధికి కృషి చేస్తానని చొప్పదండి ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం అన్నారు. మండల కేంద్రంలోని వాగుపై నిర్మించిన హైలెవల్ నూతన బ్రిడ్జిని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత పదేళ్ల పరిపాలించిన బీఆర్ఎస్ ప్రభుత్వం రామడుగు బ్రిడ్జి గురించి పట్టించుకోలేదని, దీంతో ప్రజలు ప్రాణాలు అరచేతులలో పెట్టుకొని రాకపోకలు కొనసాగించారన్నారు. బ్రిడ్జి నిర్మాణం కోసం భూములు ఇచ్చిన ఇద్దరు రైతుల సమస్యలు పరిష్కరించడంలో గత ప్రభుత్వం విఫలమైందన్నారు. బ్రిడ్జి నిర్మాణం కోసం భూములను కోల్పోయిన నిర్వాసితులకు అతి త్వరలోనే నష్టపరిహారం అందేలా కృషి చేస్తానని తెలిపారు. జోరు వానలో మరమ్మతు పనులు చేపట్టిన నాయకులు, కార్యకర్తలు, అధికారులు, మాజీ ప్రజాప్రతినిదులకు కృతజ్ఞతలు తెలిపారు. బ్రిడ్జి యుద్ధప్రాతిపదికన ప్రారంభించగా, బ్రిడ్జికి ఇరువైపులా మట్టి వేయడంతో ఆర్టీసీ బస్సు వెళ్తున్న క్రమంలోనే దిగబడింది. దీంతో ప్రయాణికులు, కార్యకర్తలు బస్సును ముందుకు తోయడంతో ముందుకు సాగింది. కార్యక్రమంలో పార్టీ మండలాధ్యక్షుడు బొమ్మరవేణి తిరుపతి ముదిరాజ్, తహసీల్దార్ వెంకటలక్ష్మి, ఎంపీడీవో రాజేశ్వరి, సీఐ ప్రకాష్‌గౌడ్, గంగాధర్ ఎస్ఐలు సురేందర్, అనూష, కిరణ్‌రెడ్డి, మాజీ ఎంపీపీ జవ్వాజి హరీష్, గ్రామ కార్యదర్శి శ్రీనివాస్, మధు, జిల్లా బీసీ అధ్యక్షుడు పులి ఆంజనేయులగౌడ్, మాజీ సర్పంచ్ కోల రమేష్, జిల్లా ప్రధాన కార్యదర్శి పంజాల శ్రీనివాస్, కడె శంకర్, నర్సింగరావు, శనిగరపు స్వామి, కర్ర శ్రీను, జవ్వాజి అజయ్ తదితరులు ఉన్నారు.

## ఇంటివద్దకే రిజిస్ట్రేషన్ సేవలు

గన్నేరువరం, ఆగస్టు 29: మండల కేంద్రానికి చెందిన ఇక్కుర్తి సోమయ్య పేరున ఉన్న వ్యవసాయ భూమిని తన కొడుకు పేరున రిజిస్ట్రేషన్ చేసేందుకు గురువారం స్లాట్ బుకింగ్ ఉండడంతో సోమయ్య అనారోగ్యానికి గురై లేవలేని స్థితిలో ఉన్నందున ఇన్‌చార్జి తహశీల్దారు నరసింహాచారి సోమయ్య ఇంటి వద్దకు వెళ్లి అక్కడే రిజిస్ట్రేషన్ చేశారు. సోమయ్య వారికి కృతజ్ఞతలు తెలిపారు.

## మట్టి గణపతుల పంపిణీ

హుజూరాబాద్, సెప్టెంబరు 5: హుజూరాబాద్ పట్టణంలోని 28వ వార్డులో మున్సిపల్ చైర్‌పర్సన్ గందె రాధిక పర్యావరణ పరిరక్షణలో భాగంగా గురువారం మట్టి వినాయక విగ్రహాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ మట్టి గణపతులను పూజించాలని సూచించారు.

## సీఎంఆర్ఎఫ్ చెక్కులు పంపిణీ చేసిన ఎమ్మెల్యే



ఇల్లందకుంటలో చెక్కులు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే కౌశిక్‌రెడ్డి

ఇల్లందకుంట, సెప్టెంబరు 5: ఇల్లందకుంట మండలంలోని 17 గ్రామాల్లో హుజూరాబాద్ ఎమ్మెల్యే పాడి కౌశిక్‌రెడ్డి దంపతులు గురువారం సీఎంఆర్ఎఫ్ చెక్కులను పంపిణీ చేశారు. 77మంది లబ్ధిదారులకు రూ. 17లక్షల విలువ గల చెక్కులను బురుదను సైతం లెక్క చేయకుండా ఇంటింటికీ తిరుగుతూ లబ్ధిదారులకు అందజేశారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ బీఆర్ఎస్ ప్రభుత్వంలో లబ్ధిదారులకు సీఎంఆర్ఎఫ్ చెక్కులు ఎక్కువ మొత్తంలో అందజేసేవారిమని, కాంగ్రెస్ ప్రభుత్వం తక్కువ ఇచ్చింద న్నారు. కార్యక్రమంలో జమ్మికుంట మున్సిపల్ చైర్మన్ తక్కళ్లపల్లి రాజేశ్వర్‌రావు, మాజీ ఎంపీపీ పావని, మాజీ ప్రజాప్రతినిధులు కుమార్, దిలీప్‌రెడ్డి, మర్రి శ్రీనివాస్‌రెడ్డి, పోడేటి రామస్వామి, రాంస్వరణ్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## భారీ వర్షాలతో నష్టపోయిన రైతులను ఆదుకోవాలి



మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే రసమయి బాలకిషన్

మానకొండూర్, సెప్టెంబరు 5: నియోజకవర్గంలో ఇటీవల కురిసిన భారీ వర్షాలతో నష్టపోయిన రైతులు, ప్రజలను ఆదుకోవాలని స్థానిక మాజీ ఎమ్మెల్యే రసమయి బాలకిషన్ ప్రభుత్వాన్ని కోరారు. మానకొండూర్‌లోని బీఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో గురువారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ వర్షాలతో రోడ్లు, కల్వర్టులు, పూర్తి స్థాయిలో ధ్వంసం అయి రాకపోకలు నిలిచిపోవడంతో ప్రజలు అనేక ఇబ్బందులు పడుతున్నా స్థానిక ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ పట్టించుకోవడం లేదన్నారు. పంటలు మునిగిపోవడమే కాకుండా చెరువులు, కుంటలు తెగిపోయాయని నష్టపోయిన పంటలను సర్వే చేయించి చెరువులు, కుంటలను మరమ్మతు పనులు చేపట్టాలని ఆయన డిమాండ్ చేశారు. నియోజకవర్గంలో ఇప్పటి వరకు ఎంత మందికి రుణమాఫీ జరిగింది అన్న విషయం ఎమ్మెల్యేకు తెలియకపోవడం సిగ్గుచేటన్నారు. తాను ఎమ్మెల్యేగా ఉన్నప్పుడు వచ్చిన రోడ్ల ప్రొసీడింగ్‌లను వెనక్కి పంపడం దారుణమన్నారు. పానుడబ్బా పెట్టుకోవాలన్నా కమీషన్ తీసుకునే పరిస్థితికి ఎమ్మెల్యే దిగజారడం సిగ్గుచేటన్నారు. ఇప్పటి వరకు నియోజకవర్గంలో దళితులకు చేసిందేమిటో ఎమ్మెల్యే చెప్పాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షులు జీవి రామకృష్ణారావు, మాజీ జడ్పీటీసీ తాల్లపల్లి శేఖర్‌గౌడ్, రాష్ట్ర నాయకులు కేతిరెడ్డి దేవేందర్‌రెడ్డి, మాజీ సర్పంచులు రామంచ గోపాల్‌రెడ్డి, సింగిల్‌విండో చైర్మన్ నల్ల గోవిందరెడ్డి, పిట్ల మధు, గోపు ఈశ్వర్‌రెడ్డి ఉన్నారు.

## నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

గణేశ్‌నగర్, సెప్టెంబరు 5: నగరంలో శుక్రవారం ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు వివిధ ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు టౌన్ టు ఏడీఈ సుధీర్ కుమార్ తెలిపారు. భగత్‌నగర్ ఏరియా, ముకరంపురం ఏరియా, గీత భవన్ నుంచి మున్సిపల్ ఆఫీస్ వరకు, కలెక్టరేట్ కాంప్లెక్స్ ఆపోజిట్ ఏరియాల్లో విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు తెలిపారు.

## మహిళలు లక్ష్య సాధనకు కృషి చేయాలి

కరీంనగర్ రూరల్, సెప్టెంబరు 5: మహిళలు ఇష్టంతో పని చేసి లక్ష్య సాధనకు కృషి చేయాలని డీఆర్‌డిఓ పిడి శ్రీధర్ అన్నారు. గురువారం కరీంనగర్ మండలం జూబ్లీనగర్‌లో ఫాతిమానగర్ అడోరేషన్ సొసైటీ ఆధ్వర్యంలో కట్టు శిక్షణ కేంద్రాన్ని ఆడోరేషన్ సంస్థ ప్రాజెక్టు డైరెక్టర్ సిస్టర్ ప్రీతతో కలిసి ఆయన ప్రారంభించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ సంజీవ్ రావు, డీపీఎం ప్రవీణ్, పాల్గొన్నారు.

## శ్రీ చైతన్య డిగ్రీ కళాశాలలో పోషకాహార విలువలపై సదస్సు



మాట్లాడుతున్న డైటీషియన్ రవితేజ

గణేశ్‌నగర్, సెప్టెంబరు 5: మంకమ్మతోటలోని శ్రీ చైతన్య డిగ్రీ,పిజీ కళాశాలలో గురువారం నేషనల్ న్యూట్రిషన్ వీక్ సందర్భంగా పోషకాహార విలువలపై అవగాహన సదస్సు నిర్వహించామని కళాశాల చైర్మన్ ముద్దసాని రమేష్‌రెడ్డి తెలిపారు. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా వన్ హాస్పిటల్ డైటీషియన్ రవితేజ పాల్గొని విద్యార్థులకు పోషకాహార ప్రాముఖ్యతపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ ఎల్.శ్రీనివాస్, వైస్ ప్రిన్సిపాల్ ఎస్ కృష్ణారెడ్డి, న్యూట్రిషన్ విభాగాధిపతి రాగిణి పాల్గొన్నారు.

## రక్తదానం

గణేశ్‌నగర్, సెప్టెంబరు 5: జిల్లా కేంద్రంలో గురువారం ఆసరా ఫౌండేషన్ కరీంనగర్ (ఆపదలో సహాయానికి రా)అను స్వచ్ఛందసంస్థను ప్రారంభించినట్లు ఎన్ఎస్ఎస్ జాతీయ అవార్డు గ్రహీత, సంస్థ వ్యవస్థాపక అధ్యక్షుడు డాక్టర్.రాపోలు గోపీకృష్ణ తెలిపారు. వివేకానంద డిగ్రీ, పీజీ కళాశాలలో జరిగిన ప్రారంభ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన డాక్టర్ కె.మురళీ రిటైర్ ప్రిన్సిపాల్ మాట్లాడుతూ సేవాభావాన్ని యువతలో పెంపొందించడానికి, సామాజిక సమస్యల నిర్మూలనకు సంస్థ సభ్యులు కృషి చేయాలని పిలుపునిచ్చారు. కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ సి.హెచ్. శ్రీనివాస్ మాట్లాడుతూ నవ సమాజ నిర్మాణానికి సేవా కార్యక్రమాలు దోహద పడతాయని పేర్కొన్నారు. ఈ సందర్భంగా సంస్థ సభ్యులు, కళాశాల పూర్వ విద్యార్థులు 20 మంది రక్తదానం చేశారు. కార్యక్రమంలో బి .సంపత్ కుమార్, డాక్టర్.అలీఖాన్, కొలగాని శ్రీనివాస్, ఆసరా ఫౌండేషన్ బాధ్యులు కె.ప్రవీణ్ కుమార్, జి.తిరుపతి, ఎం.రవి చందర్, ఎస్.నిఖిల్, పి.సంతోష్ కుమార్, ఎ.సిరి పాల్గొన్నారు.

## 53వ డివిజన్‌లో స్పెషల్ శానిటేషన్ డ్రైవ్

కరీంనగర్ టౌన్, సెప్టెంబర్ 5: స్థానిక 53వ డివిజన్‌లో భారీ వర్షాల కారణంగా తలెత్తిన సమస్యలను పరిష్కరించేందుకు కార్పొరేటర్ టి. శ్రీదేవి చంద్రమౌళి ఆధ్వర్యంలో స్పెషల్ సానిటేషన్ డ్రైవ్ నిర్వహించారు. ఈ సందర్భంగా డివిజన్‌లోని మురుగునీటి కాలువల్లోని చెత్తాచెదారాన్ని తొలగించారు.

## కరాటే పోటీల ట్రోఫీ ఆవిష్కరణ

కరీంనగర్ స్పోర్ట్స్, సెప్టెంబరు 5: జిల్లా కేంద్రంలోని డాక్టర్ బిఆర్ అంబేడ్కర్ స్టేడియంలో ఈనెల 14, 15 తేదీలలో నిర్వహించనున్న ఓపెన్ కరాటే జాతీయ స్థాయి చాంపియన్‌షిప్ పోటీల ట్రోఫీని ఎమ్మెల్యే గంగుల కమలాకర్ ఆవిష్కరించారు. కార్యక్రమంలో కరాటే అసోసియేషన్ రాష్ట్ర అధ్య క్షుడు శ్రీనివాస్, బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు జివి రామకృష్ణా రావు, రాష్ట్ర కరాటే చైర్మన్ కె.వసంత్‌కుమార్, ఉపాధ్యక్షుడు గౌరు రాజిరెడ్డి, ప్రవీణ్ పాల్గొన్నారు.

## ఇంట్లోకి వర్షం నీరు

మానకొండూర్, సెప్టెంబరు 5 : మండలంలోని దేవంపల్లి గ్రామానికి చెందిన పోలం లక్ష్మి అనే మహిళ ఇంటిలోకి వర్షం నీరు రావడంతో కుటుంబ సభ్యులు ఇబ్బందులు పడ్డారు. ఐదు రోజులుగా వర్షం కురుస్తుండడంతో వరద నీరు ఇంటి పరిసరాలతో పాటు ఇంటిలోకి చేరిందని వృద్ధురాలు లక్ష్మి వాపోయింది. రెండు రోజులుగా మోటారు సహాయంతో నీటిని తీసివేస్తున్నట్లు తెలిపారు.

## విద్యార్థులకు స్టడీ మెటీరియల్ పంపిణీ

చొప్పదండి, సెప్టెంబర్: మండలంలోని రుక్మాపూర్ మోడల్ స్కూల్ విద్యార్థులకు నీట్, ఐఐటి ప్రవేశ పరీక్ష కోసం స్టడీ మెటీరియల్‌ను అందజేశారు. నవోదయ విద్యాలయం సహకారంతో, విజ్ఞాన జ్యోతి ఫౌండేషన్ ఆధ్వర్యంలో 24 మంది ఇంటర్ విద్యార్థులకు 12వేల రూపాయల విలువగల స్టడీ మెటీరియల్‌ను అందజేశారు.ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ రమేష్ పాల్గొన్నారు.

## మాదిగ ఐక్యవేదిక పోస్టర్ ఆవిష్కరణ

మానకొండూర్, సెప్టెంబరు 5: మానకొండూర్‌లో గురువారం ఈ నెల 10న నిర్వహించనున్న చలో కరీంనగర్ ఉమ్మడి జిల్లా మాదిగల ఐక్యవేదిక ఆధ్వర్యంలో పోస్టర్ ఆవిష్కరించారు. తెలంగాణ అంబేద్కర్ యువజన సంఘం జిల్లా అధ్యక్షులు సముద్రాల అజయ్ పాల్గొన్నారు.

## లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో వైద్య పరీక్షలు

గంగాధర, సెప్టెంబరు 5: గంగాధర లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో గురువారం ఉచిత వైద్య పరీక్షలు నిర్వహించారు. గంగాధర ప్రధాన రహదారి మధురానగర్ చౌరస్తా 120 మందికి ఉచిత షుగర్, బీపీ, రక్త పరీక్షలు నిర్వహించారు. నవీన వైద్యశాల సిబ్బందితో పాటు క్లబ్ అధ్యక్షుడు శ్రీరాం శ్రావణ్, ప్రధాన కార్యదర్శి సమ్మయ్య ఉన్నారు.

● జమ్మికుంట రూరల్ : జమ్మికుంట మండలం మడిపల్లి, మాచనపల్లి గ్రామాల్లో వావిలాల ప్రాథమిక ఆరోగ్యకేంద్రం ఆధ్వర్యంలో గురువారం వైద్య శిబిరం డాక్టర్ ఫర్హానుద్దీన్, డాక్టర్ సంధ్య పాల్గొన్నారు.

● వీణవంక:మండలంలోని ఘన్ముక్ల తెలంగాణ ఆదర్శ పాఠశాలలో గురువారం ఇంటర్ మొదటి సంవత్సర విద్యార్థులకు ఆహ్వానోత్సవం నిర్వహించారు.

## ఎస్సైకి సన్మానం

సెదాపూర్, సెప్టెంబరు 5: సైదాపూర్ నూతన ఎస్సైగా బాధ్యతలు తీసుకున్న తిరుపతిని యూత్ కాంగ్రెస్ నాయకులు గురువారం మర్యాద పూర్వకంగా కలిసి శాలువాతో సన్మానించారు. కార్యక్రమంలో యూత్ కాంగ్రెస్ మండలాధ్యక్షుడు రఘు యాదవ్, మండల సోషల్ మీడియా కోఆర్డినేటర్ అజయ్ తదితరులు పాల్గొన్నారు.

## గురుకులాల్లో గెస్ట్ పార్ట్ టైం ఉద్యోగులను కొనసాగించాలి

గణేశ్‌నగర్ గురుకులాల్లో పని చేసేటటువంటి గెస్ట్ పార్ట్ టైం ఉద్యోగులను కొనసాగించాలని. సమాచార హక్కు రాష్ట్ర అధ్యక్షులు దొగ్గలి శ్రీధర్ గురుకులాల సెక్రటరీలను, ప్రభుత్వాన్ని కోరారు. పాత వారిని తొలగించి కొత్తవారిని తీసుకోవడంలో ఆంతర్యం ఏమిటని వారు ప్రశ్నించారు.